జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 84 విశాఖపట్నం గురువారం 09 డిసెంబరు 2021 8 పేజీలు వెల : 5.00

# ఘోర ప్రమాదం

## కూలిన సైనిక హెలికాప్టర్... 13 మంది దుర్మరణం

### చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ కన్నుమూత

### ప్రమాదంలో చిత్తూరు జిల్లా వాసి మృతి

చెన్నై: తమిళనాడు కూనూరు సమీపంలో సైనిక హెలికాప్టర్ కూలిపోయిన ఘటనలో 13 మంది కన్నుమూశారు. హెలికాప్టర్‌లో మొత్తం 14 మంది ప్రయాణిస్తుండగా 13 మంది చనిపోయినట్లు అధికారులు ధృవీకరించారు. మృతుల్లో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ సతీమణి మధులిక ఉన్నారు. గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలుండటంతో డీఎన్ఏ టెస్టులు చేస్తున్నారు. సూలూరు నుంచి వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ కాలేజీకి వెళుతుండగా మధ్యాహ్నం 12:20 నిమిషాలకు ఈ హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణాలేమిటో తెలుసుకునేందుకు భారత వాయు సేన (ఐఏఎఫ్) దర్యాప్తునకు ఆదేశించింది.







**ప్రమాదంలో చిత్తూరు జిల్లా వాసి మృతి**

తమిళనాడులో కూలిన రక్షణశాఖ హెలికాప్టర్ ప్రమాదం మృతుల్లో చిత్తూరు జిల్లా కురబలకోట వాసి కూడా ఉన్నారు. ఎగువ రేగడ గ్రామానికి చెందిన సాయితేజ రక్షణ శాఖలో లాన్స్ నాయక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్‌కు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా సాయితేజ విధులు నిర్వహిస్తుండగా దుర్ఘటన జరిగింది. సాయితేజ 1994లో జన్మించారు. 2013లో ఆర్మీలో చేరారు.

సాయితేజకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లల చదువుల కోసం నివాసాన్ని మదనపల్లికి మార్చారు. చివరిసారిగా వినాయక చవితికి సాయితేజ స్వగ్రామానికి వెళ్లారు. ఉదయం తన భార్యతో సాయితేజ ఫోన్లో మాట్లాడినట్లు సాయితేజ బాబాయ్ సుదర్శన్ తెలిపారు. ఈ హెలికాప్టర్ ప్రమాదంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ కన్నుమూశారని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ప్రకటించింది. ఘటనలో రావత్‌తో పాటు ఆయన భార్య సహా 13 మంది చనిపోయారంటూ ఐఏఎఫ్ ట్వీట్ చేసింది.

## మరోసారి ఏపీకి...

# కేంద్రం మొండిచేయి








ఢిల్లీ: ఏపీకి కేంద్రం మరోసారి మొండిచేయి చూపింది. ఏపీలో రైల్వేజోన్ హామీకి కేంద్రం తిలోదకాలు ఇచ్చింది. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌పై కేంద్రం వైఖరిని స్పష్టం చేసింది. దేశంలో ఇక కొత్త రైల్వే జోన్‌లను ఏర్పాటు చేసే ఉద్దేశం లేదని కేంద్రం తేల్చిచెప్పింది. బీజేపీ ఎంపీ అజయ్‌నిషాద్ ప్రశ్నకు కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ జవాబిచ్చారు. దేశంలో ప్రస్తుతం 17 రైల్వేజోన్లు ఉన్నాయని కేంద్రమంత్రి వెల్లడించారు. విశాఖ రైల్వేజోన్ అంశాన్ని అశ్వనీ వైష్ణవ్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వాల డిమాండ్ మేరకు.. మరిన్ని జోన్‌లను ప్రకటించే ఉద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలపై గతంలో ఓఎస్‌డీని కేంద్రం నియమించింది. రైల్వేజోన్‌పై కేంద్రానికి ఓఎస్‌డీ నివేదిక ఇచ్చింది. అయితే దీనిపై ఎటూ కేంద్రం తేల్చలేదు. ఇక ఏపీలో రైల్వేజోన్ అసాధ్యమంటున్న రైల్వేశాఖ అధికారులు చెబుతున్నారు. రైల్వేజోన్‌పై కేంద్రం దగ్గర ఇప్పటివరకూ జగన్ ప్రభుత్వం ప్రస్తావించలేదు. జగన్ ప్రభుత్వం స్పందించని కారణంగానే ఏపీ రైల్వేజోన్‌ను కేంద్రం పక్కన పెట్టిందని రైల్వేశాఖ అధికారులు విమర్శిస్తున్నారు.

## బిపిన్ రావత్‌కు పలువురి సంతాపం

న్యూఢిల్లీ: తమిళనాడు ఆర్మీ హెలికాప్టన్ కుప్పకూలిన ఘటన ప్రతి ఒక్కరిని తీవ్రంగా కలిచి వేస్తోంది. హెలీకాప్టర్‌లో మొత్తం 14 మంది ప్రయాణిస్తుండగా.. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్, ఆయన భార్య మధులితోపాటు 11 మంది సైనిక సిబ్బంది మృతి చెందినట్లు వాయుసేన అధికారికంగా వెల్లడించింది. బిపిన్ మృతి పట్ల (మిగతా 2లో..)



## విద్యార్థుల భోజనం విషయంలో రాజీ లేదు (వివరాలు 2లో..)

# పేదలకు మంచి అవకాశం కల్పిస్తున్నాం: సీఎం జగన్



తాడేపల్లి: జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం (ఓటీఎస్), గృహ నిర్మాణంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఓటీఎస్‌పై అవగాహన కల్పించాలని.. ప్రజలకు ఏ రకంగా మంచి జరుగుతుందో చెబుతూ, వారికి అవగాహన కలిగించాలని సీఎం ఆదేశించారు. ఓటీఎస్ పథకం పురోగతిపై సీఎంకు అధికారులు వివరాలు అందించారు. 22-ఎ తొలగింపునకు ఇప్పటికే ఉత్తర్వులు జారీచేశామని అధికారులు తెలిపారు. ఓటీఎస్ వినియోగించుకున్నవారికి స్టాంపు డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, యూజర్ ఫీజులను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ పనులు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఓటీఎస్ వినియోగించుకున్నవారికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఫీల్డ్‌స్కెచ్, లోన్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌లు ఇస్తున్నామని తెలిపారు.

## జీజీహెచ్‌లో నిలిచిపోయిన వైద్య సేవలు

గుంటూరు: జీజీహెచ్‌లో వైద్య సేవలు నిలిచిపోయాయి. మంగళవారం నుంచి విధులు బహిష్కరించి జూనియర్ డాక్టర్లు ఆందోళన చేస్తున్నారు. దీంతో సకాలంలో వైద్య సేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూడాల సమ్మెపై అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి జీజీహెచ్ ఎదుట బైఠాయించిన నిరసన చేపట్టారు. రోగి బంధువులు ఓ జూనియర్ డాక్టర్‌పై దాడికి పాల్పడ్డారంటూ నిన్నటి నుంచి వైద్యులు ఆందోళనకు దిగారు. సీఎం బంధువులమని వైద్యులపై కొందరు యువకులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే.

## 11 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం



అమరావతి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన 11 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు బుధవారం ఏపీ మండలి ఛైర్మన్ ఆఫీస్‌లో ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేశారు. ఏకగ్రీవమైన నూతన ఎమ్మెల్సీలతో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ప్రమాణం చేయించారు. 8 జిల్లాల నుంచి 11 స్థానాలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా వైయస్ఆర్ సీపీ అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. విజయనగరం జిల్లా నుంచి ఇందుకూరు రఘురాజు (క్షత్రియ, ఓసీ), విశాఖపట్నం నుంచి వరుదు కల్యాణి (కొప్పుల వెలమ, బీసీ), వంశీకృష్ణయాదవ్ (యాదవ్, బీసీ), తూర్పుగోదావరి నుంచి అనంత ఉదయభాస్కర్ (కాపు, ఓసీ), కృష్ణా జిల్లా నుంచి తలశిల రఘురాం (కమ్మ, ఓసీ), మొండితోక అరుణ్‌కుమార్ (మాదిగ, ఎస్సీ). గుంటూరు నుంచి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (కాపు, ఓసీ), మూరుగుడు హనుమంతరావు (చేనేత, బీసీ), ప్రకాశం నుంచి తూమాటి మాధవరావు (కమ్మ, ఓసీ), చిత్తూరు నుంచి వైయస్ఆర్ సీపీ కుప్పం ఇన్‌చార్జ్ భరత్ (వన్యకుల క్షత్రీయులు, బీసీ), అనంతపురం వై. శివరామిరెడ్డి (రెడ్డి, ఓసీ) శాసనమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి శాసనసభ వ్యవహారాల శాఖ, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు.



# బిపిన్ రావత్‌కు పలువురి సంతాపం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు సంతాపం ప్రకటించారు.

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం**

తమిళనాడు హెలికాప్టర్? ప్రమాదంలో కన్నుమూసిన బిపిన్ రావత్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. "జనరల్ బిపిన్ రావత్ అద్భుత సైనికుడు. నిజమైన దేశభక్తుడు. ఆయన మన సాయుధ బలగాలను, భద్రతా యంత్రాంగ ఆధునీకీకరణలో దోహదపడ్డారు. వ్యూహాత్మక విషయాలపై ఆయన ఆలోచనలు అసాధారణం. ఆయన మృతి నన్ను తీవ్రంగా కలచివేసింది. ఓం శాంతి' . అని ట్వీట్ చేశారు.

**రాష్ట్రపతి రామ్ నాథ్ కొవింద్ సంతాపం**

జనరల్ బిపిన్ రావత్, అతని భార్య మధులిక అకాల మరణం పట్ల రాష్ట్రపతి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం తన ధీర కుమారుల్లో ఒకరిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభూమికి అతని నాలుగు దశాబ్దాల నిస్వార్థ సేవ అసాధారణమైన శౌర్యం, వీరత్వం గుర్తించబడిందన్నారు. హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణనష్టం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో మరణించిన ప్రతి ఒక్కరికి నివాళులు అర్పించడంలో తాను తోటి పౌరులతో కలుస్తానని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా కెవి.ప్రసాద్



విశాఖపట్నం , డిసెంబర్ 8 ప్రజాపాలన ప్రతినిధి: అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గా ప్రసాద్ పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి తరపున బాధ్యతలు స్వీకరించారు..అఖిల భారత శరీర అవయువ దాతల సంఘం జాతీయ అధ్యక్షురాలు మరియు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఏపీ ఇంచార్జ్ గూడూరు సీతామహాలక్ష్మి నుండి రాష్ట్ర అధ్యక్షుడు గా నియామకపు ఉత్తర్వులు స్వీకరించారు రు ఈ సందర్భంగా పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి జాతీయ కన్వీనర్ కటికల శివ భాగ్య రావు కె.వి ప్రసాద్ కు అభినందనలు తెలియజేశారు అలాగే సావిత్రిబాయి పూలే ట్రస్ట్ కార్యాలయం, సీనియర్ సిటిజన్స్ హొమ్ నిమిత్తం 480 గజాలు స్థలం (దేశ పాత్రుని పాలెం )లో దానం గా అందజేసిన ప్రసాద్ కు పలువురు అభినందనలు తెలియజేశారు.

# విద్యార్థుల భోజనం విషయంలో రాజీ లేదు

**మెనూ అమలు లేకుంటే సహించేది లేదు**

**ప్రతి పాఠశాల పై పర్యవేక్షణ ఉండాలి**

**పెండింగ్ బిల్లులు పెట్టండి.. మంజూరు చేయిస్తాం**

**అధికారులతో విద్యాశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలలో అందిస్తున్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని, ఎక్కడైనా మెనూ సక్రమంగా అమలు కావడం లేదని ఫిర్యాదు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అధికారులతో మాట్లాడారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఎస్పీడి వెట్రిసెల్వితో పాటు ఆదర్శ పాఠశాల, కేజీబివి సెక్రటరీ లు, అన్ని జిల్లాల డీఈఓ లు, ఏపీసీ లు, ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఇటీవల కొన్నిచోట్ల వస్తున్న ఫిర్యాదులు ఉన్నతాధికారులు పరిశీలించి నివేదిక అందించాలని కోరారు. భోజనం బిల్లులు రాలేదని చెప్పడం సరే వాటిని సకాలంలో పోర్టల్ లో ఎందుకు పొందుపరచలేక పోయారని ప్రశ్నించారు. అన్ని జిల్లాల్లో రావలసిన బకాయిలు వివరాలను వెంటనే పోర్టల్లో పొందుపరిచి నివేదిక ఇవ్వాలని త్వరలోనే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రకాశం జిల్లా దర్శి, కడప జిల్లా కాజీపేట పాఠశాలల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి ఏపీసి వారంలో నాలుగురోజులు క్షేత్రస్థాయికి వెళ్లి వారి పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేయాలని, ఆదర్శ పాఠశాలల్లో కూడా మెనూను అధికారులు పరిశీలించాలని చెప్పారు. పాఠశాలల్లో ఉన్న మొబైల్ యాప్ తరహాలో కేజీబివి, ఆదర్శ పాఠశాలల్లో కూడా యాప్ ద్వారా పర్యవేక్షణ జరగాలన్నారు. నీటి ట్యాంక్ ల పరిశుభ్రత పై దృష్టి సారించాలని, ఆర్ ఓ ప్లాంట్ లపై పర్యవేక్షణ ఉండాలన్నారు. కొన్ని చోట్ల టీచర్ల మధ్య అంతర్గత విభేదాలతో అసత్య కథనాలు బయటకు వస్తున్నాయని ఇటువంటి వివాదాలకు కారణమైన టీచర్ల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు జరుగుతున్న విద్యా పథకాలు కొంతమంది అంతర్గత కలహాల కారణంగా అబాసుపాలు కావడాన్ని సహించేది లేదన్నారు. ఏపీ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ల పర్యవేక్షణకు అధికారులతో ప్రత్యేక కమిటీని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.

# విజయ డైయిరి పాల ఉత్పత్తి లో 1000 కోట్ల టర్నోవర్

## సాధించాలనే దిశగా పనిచేస్తున్నాం: ఛైర్మన్ చలసాని ఆంజనేయులు






గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 8:బాపులపాడు మండలం వీరవల్లీ 18 ఎకరాలల్లో నూతన నిర్మిస్తున్న విజయ పాల కర్మాగారం శంకుస్థాపన పూజ నిర్వహించారు. అనంతరం హనుమాన్ జంక్షన్ పాల శీతీలకరణ కేంద్రం అవరణలో 124 పాల సహాకార సంఘాలకు 4నెలల పాల ధర వ్యత్యాసం బోనస్ 1కోటి 93 లక్షల రూపాయులకు చెక్కులను అందుచేశారు. వీరవల్లీ లో నూతనంగా నిర్మిస్తున్న పాల కర్మాగారం మార్కెట్ అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆటో మేషిన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎండి కొల్లి ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. నేడు అయిల్ ధరలు అధికంగా పెరిగిపోయాయిని ,అదనంగా 8 నెలల నుంచి డీజిల్ 18 కోట్లు , విద్యుత్తు పై 60లక్షల రూపాయలు సంస్ధ పై అదనంగా భారం పడిందన్నారు. తొలిసారిగా ఛైర్మన్ చలసాని అంజనేయులు కృషితో 10 కోట్లు కేంద్ర ప్రభుత్వం గ్రాంటుని మంజూరు చేసిందన్నారు. విజయ డైయిరి ఛైర్మన్ చలసాని అంజనేయులు మాట్లాడుతూ గత రెండేళ్లు కరోనా లాక్ డౌన్ సంక్షోభం పరిస్థితులు వచ్చిన ధైర్యంగా ఎదుర్కొని పాడి రైతులు అండగా ఉండాలనే ఉద్దేశంతో వారి సంక్షేమం ప్రధాన ధ్యేయంగా పెట్టుకుని రైతులకు పాల ధర పెంచామన్నారు. అమూల్ కి పాలు పోస్తే గుజరాత్ రైతులకు అదాయం వెళ్తుందని , హెరిటేజ్ , మోడల్ ,జేర్సి పాల పోస్తే అ సంస్థలకే లాభం చేకూరుతుందని ఒక్క విజయ డైయిరి పాలు పోస్తే అ పాలు పోసిన రైతుకే అదాయం వస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అమూల్ , హెరిటేజ్ , మోడల్ , సంఘం లాంటి సంస్థలు అమలు చేయని విధంగా విజయ డైయిరి ఒక్కటే పాడి రైతులకు క్షీరబంధు , కల్యాణమస్తు ,ఉన్నత చదువులు ఉపకారవేతనాలు లాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సగర్వంగా చెబుతున్నట్లు. చలసాని అంజనేయులు అన్నారు. పాలసేకరణ లో ఎన్ డి ఏ గణాంకాల్లో అమూల్ 6 శాతం విజయ డైయిరి 24 శాతం ఉందన్నారు. పాల సేకరణ పాల ధర పెంచాలన్న, బోనస్ ఇవ్వాలన్న సంక్షేమ పథకాలు అమలు చేయాలి అనుకున్న పాలు పోసే రైతే అ నిర్ణయం తీసుకుంటారు తప్పా ప్రభుత్వాలు ,ప్రైవేటు సంస్థలు కాదన్నారు. రైతు మరణిస్తే 50వేలు , రైతు ఇంట వివాహం లాంటి శుభకార్యం జరిగితే మంగళసూత్రంకి 20వేల రూపాయు ఐఏఎస్ , ఐపిఎస్ లాంటి గ్రూప్స్ కి ప్రిపేర్ అవుతుంటే అ విద్యార్థులు 50 వేల రూపాయలు ఉపకారవేతనాలు అందిన్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతు కుటుంబాలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో పైలట్ ప్రాజెక్టు గా పామర్రు , చిల్లకల్లు ఒక ఎంబీబీఎస్ డాక్టర్ , నర్సు , ల్యాబ్ , మందుల షాపు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సంస్థ లో ప్రతి ఒక్కరు నీతి నిజాయితీ గా పని చేయటం ద్వారా లక్ష్యాలను సాధించగలమని చెప్పారు. 2023 నాటికి రెండు పాల కర్మాగారాలు కలిపి 13 లక్షల మిల్క్ ప్రాసెసింగ్ సాధించాలన్నదే తమ ధ్యేయమన్నారు. పశువులకు మేతకు సంబంధించి 20 శాతం ప్రొటీన్లు కలిగిన మినరల్స్ అందిస్తున్నామని తెలిపారు. పాడి పరిశ్రమ పెంపొందించాలనే మేలైన హర్యానా దున్నపోతుల నుంచి.వీర్యం సేకరించేందుకు పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని చెప్పారు. పాలక వర్గం సర్వసభ్య సమావేశం అనంతరం 10 శాతం అడిట్ జరగాలన్నారు. దేశంలో ఎక్కడ అమలు చేయని విధంగా కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులుకు అత్యధికంగా లీటర్ 80 రూపాయలు ఇస్తుందన్నారు. నేడు 3లక్షల లీటర్ల పాలసేకరణ చేస్తునట్లు తెలిపారు. పాల సొసైటీ సభ్యులు , రైతులు అడిగిన సందేహాలను సంస్థ ఛైర్మన్ , అధికారులు నివృత్తి చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా పాలక వర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్, జిల్లా ట్రస్టు సభ్యులు పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్ , కృష్ణా మిల్క్ యూనియన్ జనరల్ మేనేజర్ జీ .అనిల్ కుమార్ , హనుమాన్ జంక్షన్ పాల శీతీలకరణ కేంద్రం జనరల్ మేనేజర్ సంపత్ కుమార్ వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ సంక్షేమం, మైనారిటీల శేయస్సే...షేక్.ఖలీఫాతుల్లా భాషా లక్ష్యం







ఒంగోలు : భారతీయ జనతాపార్టీ మైనారిటీ మోర్చా ఫార్మర్ రాష్ట్ర అధ్యక్షునిగా, బిజెపి ని బలోపేతం చేసేందుకు, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం, నిరాడంబరంగా సామాన్య కార్యకర్తలా, ఎండనకా వాననకా, రాత్రనకా పగలనకా, శ్రమించి ప్రచారం చేశారు. పార్టీ అంటే ప్రాణం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంటే పంచప్రాణాలు, రాష్ట్రఅధ్యక్షులు సోము వీర్రాజు అంటే అభిమానం, అగ్రనేతలంటే గౌరవంతో కూడిన ఆప్యాయత,ఇన్ని లక్షణాలు కలిపితే ఆయనే షేక్ ఖలీఫాతుల్లా భాషా. భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షునిగానే కాకుండా, నగర అభివృద్ధి సంఘం అధ్యక్షునిగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని, నిరంతరం తపిస్తుంటారు..నగరాభివృద్ధి సంఘ కార్యవర్గ సభ్యులను, జిల్లాల వారీగా నియమించి, ఆయా నగర ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నారు. అంతేకాకుండా మానవ హక్కులు పరిరక్షించేందుకు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజియన్ ఛైర్మన్‌గా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భావజాలంతో, ఖలీఫాతుల్లా భాషా చేస్తున్న కృషి ప్రశంసనీయం. అటు పార్టీపరంగా, ఇటు సామాజిక పరంగా, మరోపక్క మానవ హక్కులను రక్షించేందుకు అహర్నిశలు శ్రమించటమే కాకుండా, మరో ప్రక్క నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలలో, నిమగ్నం అవుతుంటారు. ఖలీఫాతుల్లా భాష సామాజిక సేవాదృక్పథాన్ని గుర్తించిన, కుటుంబసభ్యులు సైతం తోడ్పాటును అందిస్తుండటంతో, ప్రజా సేవా కార్యక్రమాలలో దూసుకు వెళ్తున్నారు. భారతీయ జనతాపార్టీ అభ్యర్థుల గెలుపు కోసం,జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. నరేంద్ర మోడీని విమర్శిస్తే, మాటలతోనే విమర్శకుల తాట తీశారు. పార్టీ అగ్రనేతలు ఒంగోలువస్తే,అత్యంత ఘనంగా స్వాగతం పలికి అభిమానాన్ని చాటుకున్నారు. మదర్సాలకు ప్రోత్సాహం, అనాధ పిల్లలకు,వృద్ధులకు చేయూతను అందించడం, వరద బాధితుల కోసం విరాళాల సేకరణ, ఆపన్నులకు అండగా నిలవడం, ఆయన నిత్యకృత్యాలయ్యాయి. రాష్ట్ర స్థాయిలోనూ,జాతీయ స్థాయిలోనూ పలు హోదాల్లో ఉన్నా, లేకున్నా,నమ్మిన పార్టీ కోసం,నమ్ముకున్న ప్రజల కోసం,అంకిత భావంతో అహర్నిశలు శ్రమించే,షేక్ ఖలీఫాతుల్లా భాష వంటి నాయకులు,ఉన్నత స్థాయి పదవులు అలంకరించాలని, మనస్ఫూర్తిగా కోరుకుందాం.

# కులమతాలకు అతీతంగా ప్రజలందరి ఆరాధ్యదైవం డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్



విజయవాడ : భారత రాజ్యాంగం రచించి, భావి భారత తరాలకు అందించిన గొప్ప వ్యక్తి, కులమతాలకు అతీతంగా ప్రజలందరి ఆరాధ్యదైవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్ అని, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లాబాషా అన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ మన్నం ఉషా,విజయవాడ సిటీ ప్రెసిడెంట్ జంపా రత్నకుమారి ల ఆధ్వర్యంలో, భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా, విజయవాడలోని కళాక్షేత్రం వద్ద ఉన్న, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న,హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజియన్ ఛైర్మన్ షేక్.ఖలీఫాతుల్లాబాషా మాట్లాడుతూ, సామాజిక న్యాయ దిశగా, బాబా సాహెబ్ దూరదృష్టితో, ఆనాడే భారత రాజ్యాంగం రచించి, భావి భారత తరాలకు అందించిన గొప్ప వ్యక్తి డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దార్శనికుడు, భారత రాజ్యాంగానికి ప్రాణం పోసిన మహా మేధావి, అసమానతలు లేని సమాజం కోసం, అనునిత్యం పరితపించిన మహనీయులు, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా, ఆయనను గుర్తు చేసుకుంటూ, ఘనమైన నివాళి అర్పించడం, అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కృష్ణా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గూటికల శిరీష, మరియు జంపా వెంకట సుధాకర్ బాబు,.సిరివరపు తులసిరాణి, కాస్థల శిరోమణి తదితరులు పాల్గొన్నారు.



# కుమార్తె ప్రేమ వివాహం.. తండ్రి ఆత్మహత్యాయత్నం




మదనపల్లె టౌన్ : తాము కుదిర్చిన పెళ్లి చేసుకోకుండా తన కూతురు ప్రేమించిన వాడిని పెళ్లి చేసుకుందన్న మనస్తాపంతో ఓ తండ్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు, ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం పెద్దపల్లెకి చెందిన దంపతులు డి.వెంకటరమణ(50), మల్లమ్మ మగ్గం నేసి జీవనం సాగిస్తున్నారు. వారి కుమార్తె కాల్వపల్లె పంచాయతీకి చెందిన ఓ యువకుడిని ప్రేమించింది. విషయం తెలుసుకున్న వెంకటరమణ కుమార్తెను మందలించి, కర్ణాటక రాష్ట్రం చేలూరుకు సమీపంలోని బేగంవారిపల్లెకి చెందిన బంధువుల యువకుడితో ఈ నెల 12, 13 తేదీల్లో వివాహం నిశ్చయించారు. కాగా ఆ యువతి రెండు రోజుల క్రితం ముస్లిం యువకుడితో వెళ్లి వివాహం చేసుకుంది. విషయం తెలుసుకున్న వెంకటరమణ అవమానంగా భావించి వ్యవసాయ పంటకోసం తెచ్చుకున్న ఫ్లొరైడ్ గుళికను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు.



## జర్నలిస్టులకుఇచ్చిన హామీలను నేరవేర్చాలి

**నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులడిమాండ్**

గుంటూరు,ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 8 : అపరిష్కృత సమస్యల పరిష్కారంకోసం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, ఆంధ్రప్రదేశ్ ఏలాక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహందగ్గర నిరసనచేశారు.ఈసందర్భంగా యూనియన్ నేతలుమాట్లాడుతూ వైయస్ జగన్మోహనరెడ్డి జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనదన్నారు.కొన్ని అమల లోఉన్న కమిటీలకు తిలోదకాలు ఇచ్చారు.ప్రధానంగా కరోనా మహమ్మారికి బలి అయిన జర్నలిస్టుల కుటుంబలకు ప్రకటించిన ఏక్షగ్రేషియా అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైదన్నారు .అర్హులైన జర్నలిస్టులకు తక్షణం అక్రిడేషన్ లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తు అంబేద్కర్ విగ్రహంకు వినతిపత్రం ఇచ్చారు.తక్షణం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలుచేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టి,సమాచారశాఖ మంత్రపర్యటలకు అడ్డుకుంటామన్నారు.సమస్యల పరిష్కారానికి అమరణ నిరహరదీక్ష కు కూడ వెనకాడమని హెచ్చరించారు.ఈకార్యక్రమంలోవిజయవాడ ప్రెస్ క్లబ్ ఆధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, గుంటూరు జిల్లా ఎలాక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్యక్షులు కె.సునీల్ సందీప్, ఏపియుడబ్ల్యూజె జిల్లా కార్యదర్శి యేచూరి శివ, యూనియన్ రాష్ట్ర నాయకులు మార్కండేయులు, ఎ.కె.మోహనరావు గుంటూరు జిల్లా ఏలాక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోషియేషన్ నాయకులు రాంబాబు, సిద్దెల సాయినాధ్ వెంకటప్పయ్య, సుబ్బారావు, వాసు, శ్యామ్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## రాత్రి వేళల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి: సిఐ కనకారావు



నందిగామ డిసెంబర్ 8 ప్రజా పాలన ప్రతినిధి:రాత్రి పూటల ఇళ్లల్లోకి చొరబడి హత్యలు చేసి, దోపిడీలకు పాల్పడుతున్న ముఠా రాష్ట్రంలోనికి ప్రవేశించినదని కావున ప్రజలందరూ పగటిపూట మరియు రాత్రివేళ ల్లో అప్రమత్తంగా ఉండవలెనని స్థానిక సీఐకనకా రా వు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మీ నివాస ప్రాంతాలలో అపరిచిత వ్యక్తులు అనిపించినా, అనుమానాస్పదం గా కనిపించిన వెంటనే మీయొక్క స్థానిక పోలీస్ స్టే షన్ నంబర్ కు, డయల్ 100 కు లేదా దిశా షోస్ ద్వారా తెలియజేయగలరని అయన తెలిపారు.యు వకులు మీ ప్రాంతాలలో రాత్రిపూటలు గస్తీ నిర్వ హిం చవలసిందిగా కోరడమైనది.మరీ ముఖ్యంగా మీ ప్రాం తాలలో ఎవరైనా సుదూర ప్రాంతాల నుండి అద్దెకు వచ్చిన కొత్త వ్యక్తులు లేదా మీ గ్రామ శివారు ప్రాం తా లలో గుడారాలు, గుడిసెలు ఏర్పాటు చేసుకుని ఉం టున్న వారి గురించి వెంటనే పోలీసువారికి సమాచా రం తెలియజేయాలని తెలిపారు.అదేవిధంగా మీరు మీ ఇంటికి తాళం వేసి వేరే ఊర్లకు వెల్లినచో పోలీసు వారికి సమాచారం ఇచ్చిన ఎడల పోలీసు వారు మీ ఇంటికి మరింత భద్రత పెంచే అవకాశం కలదు.గ్రామ శివారు ప్రాంతాలలో, వెంచర్లలో మరియు అపార్ట్మెం ట్లలో నివసించే వారు రాత్రిపూటల ఎవరైనా తలుపు లు తట్టిన లేదా వివిధ రకాలైన పిల్లల ఏడుపుల శ బ్దాలు చేసినా తలుపులు తీయకుండా ఇంటి లోపల నుండే సదరు వ్యక్తుల వివరాలు తెలుసుకోవలెను. అ నుమానాస్పదంగా అనిపించిన లేదా కనిపించిన వెం టనే పోలీసువారికి సమాచారం ఇవ్వవలసినదిగా అ యన తెలిపారు.

## అరుణ్ అన్న అనే నినాదాలతో హెూరెత్తిన నందిగామ

**ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడానికి బయ ల్దేరిన మొండితోక అరుణ్ కుమార్**





నందిగామ డిసెంబర్ 8ప్రజాపాలన ప్రతినిధి: మొం డి తోక అరుణ్ కుమార్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా నామినే ట్ అయిన పక్షంలో ప్రమాణ స్వీకారం చేయుటకు నం దిగామ నుండి భారీ కాన్వాయ్ తో అభిమానుల మ ధ్య బయలుదేరడం జరిగింది అయనవెంట అమరా వతికి వందలాది కార్లతో ర్యాలీగా కార్యకర్తలు,నా యకులు బయలుదేరారు.ఈ ర్యాలీ వైయస్సార్ కాం గ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేనేత వైయస్ రాజశే ఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివా ళు లు అర్పించి మొదలైజై జగన్.జై జై జగన్ అంటూ ని నాదాలుచేసినపార్టీనాయకులు, కార్యకర్తలు. అనంతరంఅంబారుపేట సత్తెమ్మ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసికీసర ,కంచికచర్ల, పరిటాలలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఘన స్వాగతంతోపూల వర్షంతో ముందుకుసాగారు.

# లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం



నరసాపురం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) :గర్భస్థపిండ,లింగ నిర్ధారణ పరీక్షలను చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్, కమిటీ చైర్మన్ విష్ణుచరణ్ హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుదవారం గర్భస్తపిండ లింగ నిర్ధారణ చట్టం డివిజన్ స్థాయి కమిటీ సమావేశాన్ని చైర్మన్, సబ్ కలెక్టర్ విష్ణుచరణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థపిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని దీనిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. డివిజన్ స్థాయిలో స్త్రీ, పురుష నిష్పత్తి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉందని దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలో 54 స్కానింగ్ సెంటర్లకు అనుమతులు ఉన్నాయని వాటిని కమిటీ ఆకస్మిక తనిఖీలు చేపట్టి ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్లను, రెన్యువల్స్ ను పరిశీలించాలని అన్నారు. ఏదైనా స్కానింగ్ సెంటర్లో చట్టవిరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు అందితే సంబంధిత స్కానింగ్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులను నమోదుచేస్తామని హెచ్చరించారు. అనుమతులు ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్ల వద్ద లింగ నిర్ధారణ పరీక్షలు నేరం, ఇక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు చేయబడవు అన్న హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్ల యాజమాన్యానికి కూడా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ క్రిందిస్థాయి అధికారులకు లింగనిర్ధారణ చట్టంపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చెయ్యాలని డెప్యూటీ డీఎంహెచ్ఓ ను ఆదేశించారు. పిసి పిఎన్ డిటి కమిటీ సమావేశాన్ని ప్రతినెలా తప్పనిసరిగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో కమిటీ కన్వీనర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ వి ప్రసాద్, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ యాదవ్, లీగల్ ఎక్స్పర్ట్ చల్ల దానయ్య, రేడియోలజిస్ట్ డాక్టర్ కె. హరిణి, గైనికాలజిస్ట్ డాక్టర్ ఎమ్.పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ భాస్కరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎమ్ నాగలత తదితరులు హాజరయ్యారు.

## జగనన్న సంపూర్ణ గృహ పథకం పై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే విడుదల రజిని



చిలకలూరిపేట :(ప్రజాపాలన ప్రతినిధి)పురపాలక సంఘ కౌన్సిల్ హాల్ లో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం గురించి వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే విడుదల రజిని పాల్గొని మాట్లాడుతూ ఈ పథకం వల్ల ప్రతి ఒక్కరికి గృహం పై పూర్తి అధికారం వస్తుందని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే దీని ద్వారా బ్యాంకులో రుణ సౌకర్యం పొందవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో హౌసింగ్ బోర్డు ద్వారా గృహ రుణాలు తీసుకున్నవారు వన్టైమ్ సెటిల్మెంట్ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రఫాని, కమిషనర్ రవీంద్ర, వైస్ చైర్మన్ లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం, ఎంపీపీ దేవినేని శంకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## దోపిడి దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు:: డి.ఎస్.పి సిహెచ్ విజయ్ భాస్కర్



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)యడ్లపాడు మండలం పరిధిలోని లింగారావుపాలెం -ఉప్పరపాలెం, )సొలస-చంఘీజ్ ఖాన్ పేట మార్గాలలో గత రెండు రోజులుగా దోపిడి దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ సీహెచ్ విజయ భాస్కర్ రావు పేర్కొన్నారు. బుధవారం సంఘటన ప్రాంతాన్ని పరిశీలించిన డీఎస్పీ విజయ భాస్కర్ రావు మాట్లాడుతూ సమీప గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోపిడి దొంగలు మాట్లాడే భాష ను బట్టి స్వచ్ఛమైన తెలుగు మాట్లాడుతున్నారని బాధితులు పేర్కొన్నట్లు తెలిపారు. ఇకపై నేరాలు జరగకుండా నలుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు 50 మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కొండవీడు ప్రాంతంలోనూ ప్రత్యేక కూంబింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

## ఎమ్మెల్సీగామొండితోక అరుణ్ కుమార్ పదవీబాధ్యతలు



అమరావతి డిసెంబర్ 8ప్రజాపాలనప్రతినిధిఎట్టకే ల కు ఫలించిన కల స్థానిక ఎమ్మెల్సీ కోటాలో అరుణ్ కుమార్ బుధవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసి బా ధ్యతలు చేపట్టారు ఈ కార్యక్రమంశాసనమండలి చై ర్మన్ చాంబర్ లో జరిగినది. అరుణ్ కుమార్ తో ఎ మ్మెల్సీగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రా జు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ ప్రమాణ స్వీ కార కార్యక్రమంలో పలువురు మంత్రులు ,ఎమ్మెల్యే లు పాల్గొనిఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపారుఈ సం దర్భంగాఅరుణ్ మాట్లాడుతూముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాన ని తెలిపారు.

## పితృవియోగం పొందిన ఎలీషాను, పరామర్శించిన మాజీఎమ్మెల్యే ఆమంచి



చీరాల(ఒంగోలు) : చీరాల పట్టణములోని 30 వ వార్డు వైస్సార్సీపీ నాయకుడు కుంభ ఎలీషా తండ్రి ఇటీవల అనారోగ్యముతో మృతి చెందగా,ఈరోజు ఆదరణ కుంభా.ఎలీషా ను, ఎలీషా కుటుంబ సభ్యులను కూడిక జరిగింది. పితృ వియోగం పొందిన కార్యక్రమములో, చీరాల వైస్సార్సీపీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని, వారి కుటుంబసభ్యులను పరామర్శించి, విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో ఆమంచితో పాటు మాజీ కౌన్సిలర్ శీలం శ్యామ్, మరియు సంఘ పెద్దలు పాల్గొన్నారు

## పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్



మైలవరం డిసెంబర్8 ప్రజాపాలన ప్రతినిధి మైలవరం జమీందారు ద్వారక తిరుమల దేవస్థానం చైర్మన్ య స్ వి సుధాకరరావు 80 వ పుట్టిన రోజు వేడుక సం దర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమం లో నూజవీడు శాసనసభ్యులు మేకా ప్రతాప అప్పారావుతో కలసి మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు పా ల్గొన్నారు.బుధవారం నాడు మైలవరం లోని జమీం దారుస్వగృహం లో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే లు వ సంత కృష్ణ ప్రసాదు, మేకా ప్రతాప అప్పారావు స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సం దర్భంగా అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్ చే శారు. గజమాలతో ఘనంగా సత్కరించారు.

## ఖైరుల్లా కుటుంబాన్ని పరామర్శించిన ప్రత్తిపాటి





చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)మండలం లోని వనుమద్రు గ్రామంలోని ఇటీవల డాక్టర్ మీర్ ఖైరుల్లా ( డాక్టర్ )కుమారుడు మోహిసీన్ ఇటీవల మృతి చెందారు వారి ఇంటికి వెళ్లి వారి వినిన్ చిత్రపటానికి నివాళు లు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ని తెలియజేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపఅధ్యక్షులు,మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, గ్రామా నాయకులు ,కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

కొండపల్లి వెంకటేశ్వర్లు మృతి చాలా బాధాకరం:ప్రత్తిపాటి.

చిలకలూరిపేట మండలం పసుమద్రు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొడవల్లి వెంకటేశ్వర్లు అకాల మరణాన్ని చింతిస్తూ వారి భౌతిక దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియపరిచి వెంకటేశ్వర్లు లేని లోటు ఎంతో బాధాకరమైన విషయం అంటూ ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB — SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :

| | | | |
|---|---|---|---|
| Hyderabad | 76600 27682, 7842106355 | Tirupathi | 94400 77239 |
| Visakhapatnam | 0891-2791205, 9246663046 | Bapatla | 94403 20562 |
| | 7660027696, 7660027664 | Ponnur | 99089 91763 |
| Vijayawada | 76600 27670, 900062111 | Cherukupalli | 79958 56068 |
| | | Karlapalem | 76600 27676 |

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 09, డిసెంబరు 2021

# పెట్టుబడి దురాశే అసలు ప్రమాదం

వ్యాక్సిన్లు, యాంటీవైరల్ ఔషధాలు చౌకగాను, అవసరానికి తగినంతగాను లభించడం అనేది కీలకం. ఇక్కడే ఫైజర్ కంపెనీ అమెరికన్ ప్రభుత్వ మద్దతుతో పెద్ద ఎత్తున లాభాల వేట సాగించింది. తాను ఉత్పత్తి చేసే వ్యాక్సిన్లు, ఔషధాలు కావాలంటే అడిగిన ధరను చెల్లించడమే కాకుండా ఎటువంటి కోర్టు వివాదాలు తలెత్తినా వాటి నుండి తన సంస్థను కాపాడే బాధ్యత, రక్షణ ఆ ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేస్తోంది. పేద దేశాలు అంతంత రేట్లు చెల్లించలేవు. అంతేగాదు, కోర్టు వివాదాల నుండి రక్షణ గ్యారంటీ చేయడం కోసం ఆ దేశాల బంగారం నిల్వలను, రేవు పట్టణాలను పూచీకత్తుగా పెట్టాలని ఫైజర్ కోరుతోంది ! సార్స్–కోవిడ్ 2 వైరస్ నుంచి కొత్తగా పరిణామం చెందిన ఒమిక్రాన్‌ను దక్షిణాఫ్రికాలో మొట్టమొదటగా ఈ మధ్యనే గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఒమిక్రాన్ ను "ఆందోళన కలిగించే" వైరస్‌గా ప్రకటించింది. ఇతర దేశాలలో కూడా ఒమిక్రాన్ సోకినట్టు బైట పడింది. కాబట్టి ఈ వైరస్‌ను ఏదో ఒక భౌగోళిక ప్రదేశానికి పరిమితం చేయడం సాధ్యం కాదని స్పష్టమైపోయింది. కరోనా వైరస్ లలోకెల్లా డెల్టా ఎక్కువగా వ్యాప్తి చెందింది. ఇప్పుడు ఆ డెల్టాను అధిగమించి ఒమిక్రాన్ అంతకన్నా ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. పేద దేశాలలో అత్యధికులకు ఇంతవరకూ కరోనా వ్యాక్సిన్లు అందలేదు. ఇంకోవైపు పచ్చి మితవాద భావాల ప్రభావాలకు లోనైన వారంతా అసలు వ్యాక్సిన్ విధానాన్నే వ్యతిరేకిస్తున్నారు. వెరసి ఇప్పుడిప్పుడే కరోనా తాకిడి నుండి కొద్దికొద్దిగా కోలుకుంటున్న ప్రపంచం ఈ ఒమిక్రాన్ విజృంభణతో మళ్ళీ సంక్షోభంలో పడిపోయే ప్రమాదం ఉంది. ప్రపంచం మొత్తం మీద అందరికీ వ్యాక్సిన్ అందించగలిగితేనే కోవిడ్ ముప్పు నుండి బైటపడగలమని ప్రపంచ ఆరోగ్య సంస్థ మొదటి నుండీ చెప్తూనే వుంది. అందరి రోగనిరోధక శక్తినీ పెంపొందించి కరోనా ముప్పును ఎదుర్కొనేవిధంగా సంసిద్ధం చేసినప్పుడు మాత్రమే కోవిడ్–19 మహమ్మారి నుండి బైటపడి పెద్ద సంఖ్యలో మరణాలు జరగకుండా, ఆర్థికంగా చితికిపోకుండా నివారించడం సాధ్యపడుతుంది. మొదటి ప్రపంచ యుద్ధం అనంతరం ఇన్‌ఫ్లుయెంజా వైరస్ తో 5 నుండి 10 కోట్ల మంది చనిపోయారు. వారిలో సగం మంది మన దేశస్థులే. మనకు ప్రకృతి సిద్ధంగా రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. నిజమే, కాని అలా పెంపొందడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఈ లోపు ఎన్నో విలువైన ప్రాణాలను మనం కోల్పోతాం. అందుకే ఈ మహమ్మారిని అరికట్టడానికి వ్యాక్సిన్లను ఉపయోగించాలి. ఆ వ్యాక్సిన్లు ప్రపంచ జనాభా మొత్తానికి అందించాలి. కాని ఇప్పుడు బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలు వ్యాక్సిన్లపై పేటెంట్లను సడలించడాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. పేటెంట్ నిబంధనలను సడలించి, వాటిని తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని పేద దేశాలతో పంచుకుంటే ఆ దేశాలు ఈ ప్రాణ రక్షక వ్యాక్సిన్లను చౌకగా తమ దేశాల ప్రజలకు అందించగలుగుతాయి. అమెరికా, ఒకవైపు వ్యాక్సిన్లపై పేటెంట్లను సడలించాలని అంటూనే మరోవైపు తమ దేశంలోని ఫైజర్, మోడర్నా వంటి బడా బహుళజాతి ఔషధ కంపెనీలకు అన్ని విధాలా దన్నుగా నిలబడింది. 'పీపుల్స్ వ్యాక్సిన్ అలయన్స్' అనే సంస్థ ప్రచురించిన లెక్కల ప్రకారం ఫైజర్, మోడర్నా ఈ ఏడాది 3400 కోట్ల డాలర్ల లాభాన్ని సంపాదిస్తాయి. రోజుకి 9 కోట్ల 35 లక్షల డాలర్ల లాభం అన్నమాట (మన కరెన్సీలో రోజుకు సుమారు రూ.700 కోట్లు). ఈ రెండు కంపెనీల ఒక సంవత్సరపు లాభంతో పేద దేశాల జనాభా మొత్తానికి వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించవచ్చు ! ఫైజర్, మోడర్నా సంస్థలు తాము ఉత్పత్తి చేసిన వ్యాక్సిన్లలో వరుసగా 1 శాతాన్ని, 0.2 శాతాన్ని మాత్రమే పేద దేశాలకు పంపిణీ చేశాయి. కరోనా పేద దేశాలను ఎంత ఇబ్బందికి గురి చేసినా, తమ దేశాల ప్రజలను మాత్రం దాని బారి నుండి రక్షించుకోగలమని సంపన్న దేశాలు భావిస్తున్నాయి. తక్కిన వ్యాక్సిన్ల కన్నా మెరుగైనవిగా పరిగణించబడుతున్న ఫైజర్, మోడర్నా కంపెనీల వ్యాక్సిన్లు తమ జనాభా మొత్తానికి పూర్తి రోగనిరోధక శక్తిని కల్పించగలవని ఈ సంపన్న దేశాలు నమ్ముతున్నాయి. ఐతే ఒమిక్రాన్ తో వస్తున్న అనుభవం బట్టి ఆ వైరస్‌లో మన శరీరంలోని ముక్కు లోపలి భాగానికి, శ్వాసకోశ వ్యవస్థ లోని పైభాగానికి గట్టిగా అతుక్కునే భాగం (స్పైక్ ప్రొటీన్) రానురాను ఇంకా బలంగా పరిణామం చెందుతోందని తెలుస్తున్నది. దానివలన ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువగా, మరింత త్వరగా వ్యాప్తి చెందుతుంది. అంతేగాక, వ్యాక్సిన్ కల్పించే రోగ నిరోధక కవచాన్ని తప్పుకుని శరీరంలోకి చొరబడే అవకాశం పెరుగుతుంది. ఈ ఒమిక్రాన్ ఇప్పటికే 30 మ్యుటేషన్లకు లోనైనట్టు తెలుస్తోంది. ఇది చాలా అసాధారణమైన విషయం.

ఇన్ని మ్యుటేషన్లకు ఆ వైరస్ గురి కావడం అనేది కేవలం అది మానవ దేహాలను ఆశ్రయించి వుంటూనే జరిగిందా, లేక మధ్యలో వేరే ఏ జంతువు శరీరంలోనో చొరబడి మార్పులకు గురై, తిరిగి మళ్ళీ మానవ దేహాలను ఆశ్రయించిందా అన్నది ఇంకా తేలలేదు. ప్రస్తుతం మనం ఔషధపరంగా రెండు విధాలుగా జోక్యం చేసుకోగలం. ఈ అవకాశం మనకు కరోనా ప్రారంభమైనప్పుడు లేదు. ఇప్పుడు మన దగ్గర వ్యాక్సిన్లు ఉన్నాయి. వాటివలన ఈ ఒమిక్రాన్ వ్యాప్తిని పూర్తిగా నిరోధించలేకపోవచ్చు. కాని మన రోగనిరోధక శక్తి పెరుగుతుంది గనుక ఎంతో కొంత రక్షణ లభిస్తుంది. మన రోగ నిరోధక వ్యవస్థకు జ్ఞాపకశక్తి ఉంటుంది. గతంలో సోకిన ఇన్‌ఫెక్షన్లకు సంబంధించి, తీసుకున్న వ్యాక్సిన్ లకు సంబంధించిన ఆ జ్ఞాపకం ఇప్పుడు ఏదైనా ఒక కొత్త ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు కూడా ఉపయోగపడుతుంది. ఇదికాక మన వద్ద ఇప్పుడు మరో రెండు కొత్త యాంటీ వైరల్ ఔషధాలు ఉన్నాయి. తాజా పరీక్షల్లో అవి సమర్థవంతంగా పని చేస్తున్నట్టు రుజువైంది. వాటిలో మోల్నుపిరావర్ అనేది ఒకటి. గతంలో ఇన్‌ఫ్లుయెంజాను నిరోధించడానికి వాడే ఈ మందును ఇప్పుడు కోవిడ్–19ని కూడా నిరోధించేటట్టుగా తిరిగి రూపొందించారు. దీనిని రిడ్జ్‌బ్యాక్ అనే ఒక చిన్న ఫార్మా కంపెనీ తయారుచేసింది. ఇక రెండవది పాక్స్‌లోవిడ్. దీనిని ఫైజర్ సంస్థ ఉత్పత్తి చేసింది. ఈ రెండు ఔషధాలూ నోటి ద్వారా సేవించేవి. కోవిడ్ సోకిన తొలి దశలోనే వీటిని సేవించవచ్చు. ఆ తొలి దశలో యాంటీ వైరల్ మందులు శక్తివంతంగా పని చేస్తాయి. ఇప్పటిదాకా ఉన్న యాంటీ వైరల్ ఔషధం రెమ్‌డెసివిర్ ఒక్కటే అది కూడా ఇంజెక్షన్ రూపంలోనే ఇవ్వాలి. పైగా చాలా ఖరీదు. అందుచేత ఎక్కువమంది ఉపయోగించలేరు. కాని ఈ కొత్త ఔషధాలు ఎక్కువమంది ఉపయోగించవచ్చు. వ్యాక్సిన్లు కోవిడ్ నుండి మనల్ని పూర్తిగా రక్షిస్తాయా లేదా అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. వ్యాధి ముదరకుండా అడ్డుకోవడంలోను, ఎక్కువ మరణాలు సంభవించకుండా, ఎక్కువమంది ఆస్పత్రులలో చేరవలసిన అవసరం రాకుండా చూడగలవా అన్నదే ప్రశ్న. ఆ విధంగా వ్యాక్సిన్లు ఉపయోగకరం. అదే విధమైన ఉపయోగం యాంటీ వైరల్ ఔషధాల నుండి కూడా ఉంటుంది. ఈ యాంటీ వైరల్ ఔషధాలు మన శరీరంలో చేరిన వైరస్ మళ్ళీ పునరుత్పత్తి కాకుండా అడ్డుకుంటాయి. పునరుత్పత్తి తగ్గితే మ్యుటేషన్ అయ్యే వేగం కూడా తగ్గుతుంది. అందుచేత మనం కోవిడ్ ప్రారంభ దినాల నాటికన్నా ఇప్పుడు ఔషధపరంగా జోక్యం చేసుకోగలిగిన శక్తిని పెంచుకోగలిగాం.

# 'ప్రత్యామ్నాయం' వేటలో ప్రతిపక్షాలు



యూపీఏ నా, అది ఎక్కడుంది? బిజెపిని ఓడించేందుకు వేము వ్యూహాన్ని రూపొందించాల్సి ఉన్నది' అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గత వారం ముంబైలో ఎన్‌సిపి నేత శరద్‌పవార్‌ను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ అన్నారు. శరద్‌పవార్ కూడా అదే మాట అన్నారు. కాంగ్రెస్ లేకుండా ఒక కూటమిని ఏర్పాటు చేయడానికి మమతా బెనర్జీ సన్నద్ధమవుతున్నట్లు శివసేన ఎంపీ సంజయ్ రావత్ శివసేన అధికారిక పత్రిక 'సామ్నా'లో రాసిన వ్యాసంలో చెప్పారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌ను కూడా కలుసుకుంటానని, ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని మమతా బెనర్జీ ఢిల్లీలో తెలిపారు. అఖిలేశ్ ఇప్పటికే ఉధృతప్రచారం ప్రారంభించగా, ఆయన ప్రజాయాత్రలకు జనం పెద్ద ఎత్తున హాజరు కావడం విస్మరించదగిన పరిణామం కాదు. తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌ను కూడా మమతా బెనర్జీ విశ్వాసంలోకి తీసుకున్నట్లు, ప్రశాంత్ కిషోర్ టీమ్ సభ్యుడు ఒకరు బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంపై కేసీఆర్‌తో చర్చించినట్లు టిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందని మమతా బెనర్జీ గత మార్చిలో కేసీఆర్‌కు లేఖ రాశారు. నిజానికి 2018 మార్చిలోనే కేసీఆర్ పశ్చిమబెంగాల్ వెళ్లి దేశంలో బిజెపియేతర, కాంగ్రెసేతర కూటమి ఏర్పడినప్పుడే రాజకీయాల్లో గుణాత్మక మార్పు వస్తుందని ప్రకటించారు. అయితే 2019 ఎన్నికల్లో ప్రాంతీయపార్టీలు దాదాపు 190 సీట్లు గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్ చతికిలపడిపోవడంతో దేశ రాజకీయాలు మారిపోయాయి. వాస్తవమేమంటే 1984 నుంచి 2014 వరకు పరిశీలిస్తే ప్రాంతీయపార్టీలు 43 శాతం నుంచి 52 శాతం ఓట్లను సంపాదిస్తూ వచ్చాయి. 2014లో కూడా ఆ పార్టీలు 49 శాతం ఓట్లు సాధించాయి. ప్రధానంగా కాంగ్రెస్‌ను దెబ్బతీయడం ద్వారానే బిజెపి 2014లో అధికారంలోకి రాగలిగింది. లోక్‌సభ ఎన్నికలు జరగడానికి ఇంకా రెండున్నరేళ్లు సమయం ఉన్నప్పటికీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి ప్రత్యామ్నాయం రూపొందించేందుకు సన్నాహాలు మొదలయ్యాయని ప్రతిపక్షాల శిబిరంలో జరుగుతున్న కదలికలను బట్టి అర్థమవుతోంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బిజెపి దెబ్బతింటుందని ప్రతిపక్ష నేతలు పలువురు నమ్మకంతో ఉన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను ఓడించడానికి ఇప్పటికే ప్రతిపక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఒక అవగాహనతో పనిచేస్తున్నట్లు కనబడుతోంది. 2019 ఎన్నికలకు ముందు కూడా ఇలాంటి సన్నాహాలే ప్రారంభమైనప్పటికీ అవి కొంచెం ఆలస్యంగా, పెద్దగా ప్రణాళిక లేకుండా జరిగాయి. ఆ ఎన్నికలకు ముందు 2018లో కర్ణాటకలో కాంగ్రెస్ జనతాదళ్ (సెక్యులర్)తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ బిజెపిని ఓడించి ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. దీనితో తాము పుంజుకుంటున్నామని భావించిన కాంగ్రెస్ మితిమీరిన ఆత్మవిశ్వాసంతో పొత్తుల గురించి సీరియస్‌గా ప్రయత్నించలేదు. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలలో మిత్రపక్షాలను ఏర్పర్చుకోలేకపోయింది. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీ చేశాయి, ఉత్తరప్రదేశ్‌లో బిజెపి%--%అప్నాదళ్ కూటమికి వ్యతిరేకంగా సమాజ్‌వాది పార్టీ, బహుజనసమాజ్ పార్టీ, రాష్ట్రీయ లోక్‌దళ్ కలిసికట్టుగా మహాఘట్ బంధన్ పేరుతో పోటీ చేస్తే కాంగ్రెస్ ఒంటరి పక్షిలా మిగిలిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి కూటమి 51.19 శాతం ఓట్లతో మొత్తం 80 సీట్లలో 62 సీట్లు గెలుచుకోవడంతో పాటు అనేక రాష్ట్రాల్లో బిజెపి అత్యధిక సీట్లు సాధించి తిరిగి అధికారంలోకి వచ్చింది. పశ్చిమబెంగాల్‌లో కూడా బిజెపి 17 సీట్లు సాధించడం, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీలలో దాదాపు అన్ని సీట్లు గెలుచుకోవడంతో పాటు మధ్యప్రదేశ్‌లో 29 సీట్లకు 28 సీట్లు దక్కించుకోవడం ఒక అనూహ్య పరిణామం. 437 సీట్లకు పోటీ చేసి 303 సీట్లు గెలుచుకోవడం బ్రహ్మ రహస్యమే కాదు, ఎన్నికల చరిత్రలో అద్భుతం. ఈ ఎన్నికలలో గెలిచిన తర్వాత కర్ణాటక, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలను బిజెపి పడగొట్టి కాంగ్రెస్‌ను మరింత బలహీనపరిచింది. ఆ ఎన్నికల ఫలితాలు అధ్యయనం చేసిన వారెవరికైనా కాంగ్రెస్‌ను ఓడించడం బిజెపికి పెద్ద కష్టం కాదని, ప్రాంతీయ పార్టీలతోనే అది సంఘర్షించాల్సి ఉంటుందని అర్థమవుతోంది. విచిత్రమేమంటే చింతచచ్చినా పులుపు చావనట్లు దేశంలో తానే పెద్ద పార్టీనని కాంగ్రెస్ అహంకరిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు తన గొడుగు క్రిందకు రావాలని అది ఆశిస్తోంది. నెహ్రూ%--%గాంధీ కుటుంబ వారసుడికి మాత్రమే ప్రధానమంత్రి పదవి అనుభవించే జీవిత హక్కు ఉంటుందని కాంగ్రెస్ ఇప్పటికీ విశ్వసిస్తోంది. రాహుల్ గాంధీ ఎందుకు నాయకత్వ ప్రతిభను ప్రదర్శించలేకపోతున్నారో సమీక్షించుకుని ఆత్మవిమర్శ చేసుకునే పరిస్థితిలో కాంగ్రెస్ లేదు. దేశంలో రాజకీయ పరిణామాలను అర్థం చేసుకోవడంలో విఫలమైనందువల్లే కాంగ్రెస్‌ను ఇవాళ మెజారిటీ మిత్రపక్షాలు విస్మరించే పరిస్థితి ఏర్పడింది అంతమాత్రాన కాంగ్రెస్‌ను పూర్తిగా కొట్టి వేయలేం. మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గోవా రాష్ట్రాల్లోని 140 సీట్లలో భారతీయ జనతాపార్టీకి, కాంగ్రెస్‌కు ముఖాముఖి పోటీ ఉన్నది. ఇవి కాక, పంజాబ్, అస్సాం, జార?ండ్, కేరళ, మహారాష్ట్ర, ఒడిషా, తమిళనాడు, తెలంగాణ, ఈశాన్యరాష్ట్రాలు తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ కనీసం 50 నుంచి 60 సీట్లు గెలుచుకునే అవకాశాలు ఇంకా ఉన్నాయి. ఈ 200 సీట్లలో కాంగ్రెస్ కనీసం వంద సీట్లు గెలుచుకున్నా ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించగలుగుతుంది. అయితే అందుకు తగ్గ వ్యూహం కాంగ్రెస్ వద్ద ఉన్నట్లు కనపడడం లేదు. కాంగ్రెస్ లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయడం కష్టమనేది ఆ పార్టీయేతర ప్రతిపక్షాలకు తెలియని విషయం కాదు. అదే సమయంలో ప్రతిపక్షాలను చేరదీసి మోదీకి వ్యతిరేకంగా బలమైన కూటమి ఏర్పాటు చేయగలిగిన శక్తి, విశ్వసనీయత కాంగ్రెస్ కోల్పోయిందనీ తెలుసు. కనీసం ఆ పార్టీని దాని మానాన దాన్ని వదిలేస్తే వాస్తవ పరిస్థితులు తెలుసుకుని అత్యధిక సీట్లు సాధించేందుకు తగిన ప్రయత్నం చేసే అవకాశాలున్నాయని వారు భావిస్తున్నారు. నిజానికి కాంగ్రెసేతర ప్రతిపక్షాలకు కూడా మోదీకి ప్రత్యామ్నాయం రూపొందించడం సులభం కాదని తెలియకపోలేదు. కాంగ్రెస్‌ను చావు దెబ్బతీసిన తర్వాత బిజెపి తన దృష్టి ప్రాంతీయ పార్టీలపై ప్రసరించింది. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీకి ముచ్చెమటలు పట్టించింది. సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ బిజెపి దెబ్బకు తట్టుకోలేకపోయాయి. ఒడిషాలో ఆ పార్టీ చొచ్చుకుపోయింది. తెలంగాణలో ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవడం ప్రారంభించింది. 2019లో మొదటిసారి ప్రాంతీయ పార్టీల ఓట్ల శాతం 44కు పడిపోయింది. అయినప్పటికీ బిజెపి సాధించిన 37.5 శాతం కంటే ప్రాంతీయ పార్టీల ఓట్ల శాతం ఎక్కువే. కాంగ్రెస్ మాత్రం గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో 19.5 శాతం ఓట్లతో కునారిల్లుతోంది. ఒకప్పుడు కింగ్‌మేకర్ పాత్ర పోషించిన వామపక్షాలు ఇప్పుడు పూర్తిగా అస్తిత్వ సంక్షోభంలో ఉన్నాయి. బిజెపిని ఆయా రాష్ట్రాల్లో ఓడించేందుకు ప్రతిపక్షాలు వ్యూహరచన ప్రారంభించలేదని చెప్పలేము. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు పశ్చిమబెంగాల్‌లో ఘోరంగా దెబ్బతిన్నాయి. ఆ తరువాత బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అవి కలిసి పోటీ చేశాయి. తాము విజయం సాధించడం కన్నా బిజెపిని ఓడించడమే ప్రధానమని కాంగ్రెస్, వామపక్షాలు భావించాయి. అందువల్ల అక్కడ తృణమూల్ కాంగ్రెస్ పెద్దగా ఇబ్బంది లేకుండా అధికారంలోకి రాగలిగింది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్షాలు వ్యూహం మార్చి వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి. సమాజ్‌వాది పార్టీ రాష్ట్రీయ లోక్‌దళ్‌తో పాటు చిన్నా చితక పార్టీలతో చేతులు కలపడం, అగ్రవర్ణాల ఓట్లను చీల్చేందుకు ప్రియాంకాగాంధీ ఉధృత ప్రచారం చేయడం, బిఎస్‌పి ఒంటరిగా పోటీ చేయడం ఈ పరిణామంలో భాగం. ఈ ప్రయోగం ఎంతవరకు ఫలిస్తుందో చెప్పలేము. బిజెపి మూలంగా తమ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని గమనించినందువల్లే ప్రాంతీయపార్టీలు జాతీయస్థాయిలో ఏకమయ్యేందుకు పూనుకున్నాయని అర్థమవుతోంది. అయితే ఇంటగెలిచిన తర్వాతే రచ్చగెలవడం సాధ్యమని ఆయా పార్టీలకు తెలియనిది కాదు. పలు ప్రాంతీయపార్టీలు తమ స్వంత రాష్ట్రంలో భంగపడి, జాతీయ రాజకీయాల్లో పాత్ర కోల్పోయిన ఉదంతాలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. గతంలో నేషనల్‌ఫ్రంట్ చైర్మన్ ఎన్టీఆర్‌కే ఈ పరిస్థితి తటస్థించింది. రెండవది, తమ రాష్ట్రాల్లో అన్నిసీట్లూ గెలవడం అసాధ్యమైతే, జాతీయస్థాయిలో కూడా ప్రతిసారీ 200సీట్లు గెలవడం ప్రాంతీయ పార్టీలకు అంత సులభం కాదు. ఒకవేళ గెలిచినా తమ మధ్య వైరుధ్యాల మూలంగా జాతీయస్థాయిలో అవి ఏకంకాలేవు. తమిళనాడులో డిఎంకె, అన్నాడిఎంకేబీ ఏపీలో టీడీపి, వైసీపీ మాదిరి ఒకే రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలు పరస్పరం తలపడుతున్న దృష్టాంతాలు కూడా ఉన్నాయి. మూడవది, అధికారంలో ఉన్న ప్రాంతీ య పార్టీలు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమిస్తే కాని, బిజెపిని కానీ, మరో ప్రత్యర్థి పార్టీని కానీ ఢీకొనడం సాధ్యం కాదు. దేశ రాజకీయాల్లో ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంధి దశ. ప్రతిపక్షంలో ఉన్నవారు అధికారంలోకి రావడానికి వ్యూహాలు అల్లడం సహజమైతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఇప్పటికే అగ్నిపరీక్ష ప్రారంభమైందని చెప్పవచ్చు. లేకపోతే సాగుచట్టాలను ఉపసంహరించుకోవడం జరిగేది కాదు. ఉత్తరప్రదేశ్ ఎన్నికలు ఆయన నాయకత్వానికి, వ్యూహరచనా పటిమకు ఒక సవాలు వంటివి. ఈ ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల తీరుతెన్నులపై మరింత స్పష్టత ఏర్పడుతుంది.

# మూర్తీభవించిన సంస్కారం

రోశయ్య గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులలోనే ఆయన పుట్టినరోజు సందర్భంగా ఉదయం ఏడు గంటలకు ఒక టివి ఛానెల్ ఆయనతో ఒక ప్రత్యక్ష చర్చను నిర్వహించింది. ఆ చర్చలో పాల్గొన్నప్పుడు 'మీరు పాతకాలపు నాయకులు కదా, ప్రస్తుత రాజకీయాలలో మాఫియా ప్రభావం చాలా పెరిగింది దాన్ని ఎట్లా ఎదుర్కొంటారు' అని అడిగాను. 'హరగోపాల్ గారు, ఈ మాఫియా సంస్కృతి ఒక్కరోజులో వచ్చింది కాదు, ఇది రెండు దశాబ్దాలుగా క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. నేను ఎంతకాలం ఈ పదవిలో ఉంటానో తెలియదు, కొంతకాలం కొనసాగితే దానిని మార్చడానికి నావంతు కృషి చేస్తాను' అని చాలా గౌరవంగా సమాధానం చెప్పారు. నేను ఇంటికి తిరిగి వస్తూనే ఒక ఎనిమిది, పదిమంది మాఫియా లాంటివారే మా ఇంటికి వచ్చారు. ఏం పనిమీద వచ్చారు అని అడిగితే ముఖ్యమంత్రినే ఆ ప్రశ్న అడిగిన మిమ్మల్ని చూడడానికి వచ్చాం అని అన్నారు. మరో సందర్భంలో కేసీఆర్ నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు పొత్తూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ గోపాల్‌కిషన్, చుక్కా రామయ్య, నేను రోశయ్యను కలిశాం. మీరు కేసిఆర్‌ను కలిస్తే బావుంటుంది అని పొత్తూరి సలహా ఇస్తే, 'నేను వెళ్తే ఆయన కలవడానికి నిరాకరిస్తే ముఖ్యమంత్రి పదవికి అవమానకరంగా ఉంటుంది' అన్నారు. దానికి బదులుగా పొత్తూరి, 'మీకెందుకు అవమానంగా ఉంటుంది. మీరు చేసే ఈ ప్రయత్నాన్ని ప్రజలు హర్షిస్తారు' అనడంతో వెళ్తానని అన్నారు. సలహాను గౌరవించే ఒక సంస్కారం ఆయనలో కనిపించింది. మరో సందర్భంలో రవీంద్రభారతిలో ప్రభుత్వ ఎన్‌జిఒ నిర్వహించిన సభలో నేను ఆయన పక్కనే కూచున్నప్పుడు, 'హరగోపాల్ గారూ చూసారా మా పార్టీకి సంబంధించిన వాళ్లు ఎవ్వరూ రాలేదు. ఇంకెవరైనా ముఖ్యమంత్రి అయి ఉంటే ఆయన కళ్లల్లో పడాలని గుంపులు గుంపులుగా వచ్చేవారు' అని వాపోయారు. సభలో మాట్లాడినప్పుడు మీడియానుద్దేశించి, 'వేదిక మీద ఎవరైనా ఏ కారణం వల్లనైనా చేతులు పైకి లేపితే రోశయ్య గారిని కొట్టబోతున్న దృశ్యమని మీరు రేపు పత్రికల్లో రాస్తే ఏం చేయగలను' అని చురకలు వేశారు. రోశయ్య ముఖ్యమంత్రిగా తాను బలహీనుడిననే భావించారు కాని పదవిలో ఉన్నంతకాలం చాలా హుందాగానే పనిచేశారు. తెలంగాణ ఉద్యమం విస్తృతంగా జరగడానికి ఆయన ఉదారదృక్పథం కూడా కొంతవరకు తోడ్పడింది. రోశయ్యనే కాకుండా పౌరహక్కుల ఉద్యమంలో భాగంగా నాకు తెలిసి ఎన్‌టిఆర్ మొదలుకుని కిరణ్‌కుమార్ రెడ్డి దాకా ప్రతి ముఖ్యమంత్రిని ఏవో ప్రజల సమస్యలు చర్చించడానికి కలవాల్సి వచ్చేది. ముఖ్యమంత్రిని కలవాలనే ఒత్తిడి ప్రజల నుంచి ప్రజాసంఘాల నుంచి ఉండేది. కొన్ని సందర్భాల్లో సమస్యలు పరిష్కారమయ్యేవి మరికొన్ని సందర్భాల్లో అలాగే ఉండిపోయేవి. కానీ కలిసిన ప్రతి ముఖ్యమంత్రి సమయం ఇచ్చేవారు, చాలా గౌరవించి మాట్లాడేవారు రోశయ్య కూడా ఆ సంస్కృతిని కొనసాగించారు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉండేవారు ప్రజాసంఘాలను, ప్రజాస్వామ్యవాదులను కలవడం చాలా అవసరం. వాళ్లెవరూ తమ వ్యక్తిగత సమస్యలను చర్చించరు, చర్చించకూడదు కూడ. నాయకులు ప్రజలను ప్రత్యక్షంగా కలిస్తే, వాళ్ల సమస్యలకు సానుకూలంగా స్పందిస్తే ప్రజాస్వామ్య సంస్కృతి సుసంపన్నమవుతుంది.

## రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)ఏపీ జేఏసీ, అమరావతి పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. పిఆర్సి, డీఎ బకాయి లు, సి పి ఎస్ రద్దు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ తో పాటు జేఏసీ ఇచ్చిన అన్ని డిమాండ్లను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు నాంపల్లి నాగమల్లేశ్వరరావు, జిలాని, ఏపీ జేఏసీ చిలకలూరిపేట అధ్యక్షులు హనుమంత నాయక్, వీఆర్వోల సంఘం నాయకులు రామానాయుడు, చెంచయ్య, వీఆర్ఏల సంఘం నాయకులు ఆనంద్, నాగేశ్వరరావు, ఆర్టీసీ ఎన్ఎంయు డిపో కార్యదర్శి రంగారావు ,వసంతరావు, ఆర్ ఆర్ నాయక్, పీవీ కె రావు,జె సాంబయ్య రాష్ట్రోపాధ్యాయ సంఘంరాష్ట్రకమిటీ కన్వనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ వీ ఆర్సీ నివేదిక బహిర్గతంచేయాలని,55శాతంఫిట్ మెంట్ ప్రకటించాలని,అటెండర్ నుండి ఐఏయస్ అధికారివరకు అందరూ పనిచేస్తేనే ప్రభుత్వం అని ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గుర్తించి చర్చలకు ఆహ్వానించి సహృదయంతో ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

## అవినీతి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)అఖిలభారత అవినీతి నిర్మూలన, వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు డిసెంబర్ 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో ఎస్ ఎస్ సి , ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు అవినీతి రహిత సమాజం కొరకు ప్రజల,విద్యార్థులు బాధ్యత అనే అంశం మీద అ వ్యాసరచన పోటీ ఉంటుందని ఈ పోటీలలో విజేతలకు ప్రతి తరగతికి మూడు విలువైన బహుమతులు ఉంటాయని మరియు పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఉంటుందని డిసెంబర్ 16 వరకు ఈ పోటీలు కార్యక్రమం నియోజకవర్గంలో ఉంటుందని డిసెంబర్ 24 బహుమతి ప్రధానం జరగనుందని కావున ఆసక్తి గల విద్యార్థులు విద్యా సంస్థలు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని సంస్థ అధ్యక్షులు మురికిపూడి ప్రసాద్ ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ జబ్బార్ కోరారు..పూర్తి వివరములకు మురికి పూడి ప్రసాద్ 6300166598, ,షేక్ అబ్దుల్ జబ్బార్ 98488 64078 ను సంప్రదించ వలసినదిగా తెలిపారు.

## యుటీఎఫ్ చీరాల పట్టణ శాఖ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక



చీరాల(ఒంగోలు) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చీరాల పట్టణ శాఖ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక, స్థానిక బాలికల ఉన్నత పాఠశాల చీరాల నందు జరిగింది.గౌరవఅధ్యక్షులుగా పి.సురేష్, అధ్యక్షులుగా సిహెచ్.వెలుగొండారెడ్డి, సహాధ్యక్షులుగా ఎన్.రాజేష్, సహాధ్యక్షురాలుగా వి.విజయలక్ష్మి, ప్రధానకార్యదర్శిగా ఎస్.వి.సుబ్బారెడ్డి, కోశాధికారిగా సయ్యద్ జానిభాషా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ,11వ పి.ఆర్.సి ని 55శాతం ఫిట్మెంట్తో 2018 జూలై నుండి అమలు చేయాలని, 5 డీఏ లను వెంటనే మంజూరు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, నూతన జాతీయ విద్యావిధానంలో ఉన్న లోపాలను సవరించి, ప్రాథమిక విద్యా వ్యవస్థను కొనసాగించాలని , ఎయిడెడ్ వ్యవస్థను బలోపేతం చేయటానికి తగినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాపారావు ,బండి లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు షేక్ జానీబాషా, జి.సూరిబాబు, ఎయిడెడ్ కన్వీనర్ కుర్రా శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రా రామారావు, సీనియర్ నాయకులు కె.వీరాంజనేయులు, గవిని.నాగేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులు సాంబశివరావు, పద్మావతమ్మ, ప్రాంతీయ మండల నాయకులు కార్యకర్తలు, పట్టణ శాఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోదావరిలో రోశయ్య అస్థికల నిమజ్జనం

రాజమహేంద్రవరం: మాజీ సీఎం దివంగత కొణిజేటి రోశయ్య అస్థికలను రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవు వద్ద పవిత్ర గోదావరి నదిలో బుధవారం శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ రోశయ్య కుమారులు శివసుబ్బారావు, ఎస్ఎన్ మూర్తి ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గోపూజ చేసి అస్థికలను టూరిజం బోట్లలో నది మధ్యలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఇటీవల రోశయ్య కన్నుమూశారు. లో–బీపీతో అకస్మాత్తుగా రోశయ్య పడిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయం బంజారాహిల్స్ స్టార్ ఆస్పత్రిలో ఉంది. రోశయ్య 4 జులై 1933న గుంటూరు జిల్లా వేమూరులో జన్మించారు. గుంటూరు హిందూ కళాశాలలో రోశయ్య విద్యాభ్యాసం కొనసాగించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు.

# ఎట్టకేలకు ప్రారంభమైన మోడరన్ ఫిష్ మార్కెట్



నరసాపురం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : కొద్దికాలంగా వాయిదాపడుతూ వస్తున్న పట్టణంలోని పార్క్ రోడ్డులో కొప్పర్తి వేణుగోపాలరావు మునిసిపల్ కాంప్లెక్స్ వద్ద నిర్మించిన మోడ్రన్ ఫిష్ మార్కెట్టును బుధవారం శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తో కలసి ప్రారంభించారు. అనంతరం శాసనసభ్యులు మాట్లాడుతూ పట్టణ మధ్యలో వినియోగదారులకు అందుబాటులో మోడ్రన్ ఫిష్ మార్కెట్టును అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. ఫిష్ మార్కెట్టుకు అన్ని మౌలిక వసతులు కల్పించామని ముఖ్యంగా డ్రైనేజ్ వ్యవస్థ, వ్యాపారులు, వినియోగదారులకు త్రాగునీరు, విద్యుత్, పార్కింగ్ వంటి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. గతంలో నిరుపయోగంగా ఉన్న ఫిష్ మార్కెట్టును ప్రభుత్వ నిధులతో మోడ్రన్ ఫిష్ మార్కెట్టుగా ఆధునీకరించామని వినియోగదారులకు హోల్ సేల్ ధరలకే చేపలు, రొయ్యలు వంటి ఆక్వా ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించాలని వ్యాపారస్తులకు శాసనసభ్యులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వపరంగా వ్యాపారులకు పూర్తి సహకారం ఉంటుందని వ్యాపారులకు సబ్సిడీపై రుణాలు అందించడం, పన్నులలో మినహాయింపు వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అయన హామీ ఇచ్చారు. ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్, గోడౌన్ వంటి సదుపాయాలను కల్పించామని ఆధునిక వసతులతో అందుబాటులోకి తీసుకొచ్చిన మోడ్రన్ ఫిష్ మార్కెట్టును వినియోగదారులు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహాకమిటీ చైర్మన్ బర్రె లీలా, రాష్ట్ర కార్యదర్శి బర్రె శంకర్, ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, జడ్పీటీసీ తిరుమాని బాబ్జి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు భూసారపు జయ ప్రకాష్ ,కర్రి ఏసు, దొంగ మురళి, కావలి నాని, బులిమస్తాన్, వైకేయస్, గోరు సత్తిబాబు, అండ్రాజు చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల తెలుగుయువత అధ్యక్ష ప్రధాన కార్యదర్సులుగా హరికృష్ణ, బాలకృష్ణ





చీరాల(ఒంగోలు) : చీరాల నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి లుగా వంకా హరికృష్ణ, బట్టా బాలకృష్ణ లను నియమించినట్లు, బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు, చీరాల నియోజకవర్గ తెలుగు యువత కమిటీ ని 18 మందితో బుధవారం ఎమ్మెల్యే ఏలూరి ప్రకటించారు. తెలుగు యువత ఉపాధ్యక్షులుగా చప్పిడి భాస్కర్ ,ఆకురాతి ఏడుకొండలు, షేక్ కాలేషా, అధికార ప్రతినిధులుగా డొక్కా ప్రదీప్, కాసా మధు,కార్యనిర్వాహక కార్యదర్సులుగా చిప్పలపల్లి శ్రీనివాసరావు, గొర్ల గోపి, షేక్ గౌసాని,తూమ్మా సుభాన్ రెడ్డి, దారా అశోక్, కార్యదర్సులుగా గడ్డం శ్రీనివాసరావు, కీర్తి రవిబాబు,పులిపాటి శేఖర్, అన్నంహనుమంతరావు, కోటి లింకన్, సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ గా అవ్వారు వెంకటేష్ లను నియమించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీరాలలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పని చేయాలన్నారు. తెలుగు యువత విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. యువతను కార్యక్రమాల్లో భాగస్వాములుగా చేయాలన్నారు. సమాజంలో మంచి చెడులపై ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. పార్టీకి అండగా ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే డా.సజ్జా చంద్రమౌళి విగ్రహా ఏర్పాటుకు స్థలం కేటాయించండి



చీరాల(ఒంగోలు) : చీరాల మునిసిపల్ పరిధిలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ డా.సజ్జా చంద్రమౌళి స్మారక విగ్రహాన్ని, ఏర్పాటు చేయుటకు స్థలం కేటాయించమని, చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకి, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర విజ్ఞాపన పత్రం అందించారు. సురేంద్ర మాట్లాడుతూ, స్వర్గీయ డా. సజ్జా చంద్రమౌళి చీరాల ప్రాంతంలో, ఎంతోమందికి వైద్య సేవలు అందించారు. 1981 మరియు 1985 లో రెండు పర్యాయాలు, చీరాల ఎమ్మెల్యేగా ఎన్నికై, చీరాల ప్రజలకు సేవలందించారు.మరియు చీరాల అభివృద్ధి లో ముఖ్యభూమిక పోషించారు.అటువంటి మహానుభావుని స్మరించుటకొరకు, చీరాల పట్టణంలో స్థలం కేటాయించమని కోరారు.ఈ విషయాన్ని శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే రోశయ్య చీరాల ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా, రోశయ్య స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామనడం చాలా సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల అనిల్,కంపా అరుణ్,శ్రీనివాస రెడ్డి ,బీరక సురేష్,చిలుకోటి శ్రీను,మామిడాల సుబ్బారావు పాల్గొన్నారు.

## ఓటిఎస్ మేళాపై ప్రజలకు అవగాహన కల్పించాలి



నరసాపురం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : జగనన్న సంపూర్ణ గృహహక్కు పదకం ఓటియస్ పై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సబ్ కలెక్టర్ విష్ణుచరణ్ డివిజన్లోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ గురువారం ఓటిఎస్ మేళా నిర్వహించనున్నామని జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం వన్టైమ్ సెటిల్మెంటును ప్రజలు సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, తహసిల్దార్లు, విఆర్ఓల అప్రూవల్స్ ను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరిష్కరించాలని ఆసక్తిఉన్న లబ్ధిదారులకు ముందుగా ఓటిఎస్ లో లబ్ధిచేకూర్చాలని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని సబ్ కలెక్టర్ సూచించారు. జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకాన్ని నూరుశాతం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని అన్నారు. 1983 నుంచి 2011 వరకూ వివిధ గృహనిర్మాణ పథకాలద్వారా రుణాలు పొంది ఇళ్లు నిర్మించుకున్నవారికి, ఒన్టైమ్ సెటిల్మెంట్ ద్వారా ఆయా ఇళ్లు, స్థలాలను తమ పేరుమీద రిజిష్టర్ చేసుకొనే గొప్ప అవకాశాన్ని ఈపథకం కల్పిస్తుందని, దానిపై సంపూర్ణ హక్కులు కలుగుతాయని వివరించారు. అతితక్కువ సొమ్ముతోనే శాశ్వత హక్కును పొందవచ్చునని రిజిస్ట్రేషన్ అనంతరం తమఇంటి లేదా స్థల డాక్యుమెంటుతో బ్యాంకులో రుణాలు పొందేందుకు కూడా అవకాశం ఉంటుందనే విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఈపథకం ప్రయోజనాలను లబ్దిదారులకు తెలియజేసి పథకాన్ని వారు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేకదృష్టి కేంద్రీకరించాలని అన్నారు. క్షేత్రస్థాయిలోఎదురయ్యే సమస్యలను తమదృష్టికి తీసుకురావాలని సబ్ కలెక్టర్ విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో సబ్ కలెక్టరేట్ ఏవో ఎస్. వి. సుబ్రహ్మణ్యం, హౌసింగ్ డిఇ పిచ్చయ్య, డివిజన్లోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## వన్ టైమ్ సెటిల్మెంట్ మేళాపై రివ్యూ సమావేశం



నరసాపురం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న సంపూర్ణ భూహక్కు పథకమునకు సంబంధించి నరసాపురం పురపాలక సంఘ పరిధిలో ఈనెల 9వ తేదీ గురువారం నిర్వహించనున్న వన్ టైం సెటిల్మెంట్ మేళా విజయవంతం చేసేందుకు మున్సిపల్ కమిషనర్ పి.ఎం. సత్యవేణి బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం, సర్వే , మరియు వసూళ్ళు, రిజిస్ట్రేషన్ల పై మునిసిపల్ మరియు సచివాలయ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సంపూర్ణ భూహక్కు పథకం కార్యక్రమాన్ని త్వరితగతిన అమలు చేసేందుకు పట్టణ పరిధిలోని ప్రతి సచివాలమునందు 9వ తేదీ గురువారం వన్ టైమ్ సెటిల్మెంటు ( ఓ.టి.ఎస్ ) మేళాను నిర్వహించనున్నామని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మున్సిపల్ సిబ్బందిని ఇన్ ఛార్జిలుగా నియమించామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

## పీటర్ పాల్ మినిస్ట్రీస్ లో.. అంబరాన్ని అంటిన ప్రీ క్రిస్మస్ సంబరాలు



కావలి డిసెంబర్ 8 ప్రజాపాలన ప్రతినిధి :కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ నందు పీటర్ పాల్ మినిస్ట్రీస్ చర్చ్ ఆవరణంలో ప్రీ క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. కావలి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వారి గ్రామంలోని సంఘుల ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని సువార్త ప్రార్ధన స్తుతి గీతాలతో విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఐ.సి.సి నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దేవరకొండ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రీ క్రిస్మస్ వేడుకలలో కావలి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న గ్రామా సంఘస్తూలకు ఈ కార్యక్రమానికి సువార్తను ప్రకటించి గొప్ప స్తుతి గీతాలు అందించిన ఏ. ఐ. సి.సి జాతీయ అధ్యక్షులు పోస్టల్ స్టాంప్ గ్రహీత రెవ.డాక్టర్ గేర హనూక్ , ప్రముఖ రచయిత సువార్త గాయకులు సంగీత దర్శకులు డాక్టర్ ఏ ఆర్ స్టీవెన్సన్ లు పాల్గొని సువార్త స్తుతి గీతాలు తో అందరినీ ఆనందింప చేసిన వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ బ్రదర్ పీటర్ పాల్ కావలి డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆకుల ఏసుబాబు పీటర్ పాల్ మినిస్ట్రీస్ కోఆర్డినేటర్ పాడేటి తామస్ గౌరవ సలహాదారులు ఈదూరి జైపాల్ ప్రీతం పాల్ రాహుల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంనందు లక్షతులసి పూజ



జగ్గయ్యపేట డిసెంబర్ 8 ప్రజాపాలనప్రతినిధి:జగ్గయ్య పేట మండలశీ తిరుమలగిరి గ్రామశీలో వేంచేసియు న్న శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానశీ నందు జరుగుచున్న పవిత్రోత్సవ0లలో చివరి రోజు ఆలయశీను ఎంతో సుందరశీగా పూలతో అలంకరంచి ప్రత్యేక అభిషేకశీలు నిర్వహించి లక్ష తులసి పూజ నిర్వహిం చుట జరిగినది. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించుట జరిగినది. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, ఆల య ధర్మకర్తల మండలి చైర్మన్ రాధా సుబ్రహ్మణ్యే శ్వ రరావు వారు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొ న్నా రు. నేటితో పవిత్రోత్సవములు ముగిసియున్నవి అని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాధా సుబ్రహ్మణ్యేశ్వరరావు మరియు కార్యనిర్వహణాధికారి (ఇన్ ఛార్జ్) ఎన్.ఎస్ చక్రధరరావు వారు తెలియజేసి యు న్నారు.

# ప్రభుత్వం కాలయాపన చేస్తుంది




కావలి డిశంబర్ 8 ప్రజాపాలన ప్రతినిధి :పీఆర్సీ విషయంలో కమీటీ నుండి ప్రభుత్వానికి నివేదిక వచ్చిన కాలయాపన చేస్తున్నారని ఎపి జె.ఏ.సి అమరావతి సంఘాలు తెలిపారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయం వద్ద రెండవరోజు జె.ఎ.సి కావలి డివిజన్ ప్రెసిడెంట్ ఎస్ శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జే.ఏ.సి నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎం పెంచల రావు జిల్లా సెక్రెటరీ ఎన్.వి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పెంచల రావు , .జే ఏ.సి కావలి డివిజన్ ప్రెసిడెంట్ ఎస్. శివకుమార్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జేఏసి అమరావతి, నెల్లూరు జిల్లా జె.ఎ.సి వారి పిలుపులో భాగంగా రెండవ రోజు కావలి లోని నిరసన తెలియజేశామని అలాగే ఉద్యోగులు బయటికి రావడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వమే అని 42 నెలలు పూర్తయినప్పటికీ పిఆర్సి రావాల్సి ఉందని ఇప్పటికీ వరకు రాలేదని పిఆర్సి నివేదిక కూడా ప్రభుత్వం నుండి నివేదిక ఇంతవరకు రాలేదు అని కమిటీ నుంచి ప్రభుత్వం కి నివేదిక వచ్చినా కూడా కాలయాపన చేస్తున్నారని రావాల్సిన రెగ్యులర్ 7 డి ఎ లు రాలేదని ఏపీ జి.ఎల్. ఐ నందు దాచుకున్న ఉద్యోగులు దాచుకున్న 1,600 కోట్ల రూపాయలను ప్రభుత్వం వద్ద ఉన్నాయని ఆరోగ్యరీత్యా పెళ్ళిళ్ళు అవసరాల వంటి సమస్యలపై పెట్టుకున్నామని ఇప్పుడు లోన్స్ కొరకు అప్లై చేసిన బిల్లులు రావడం లేదని గత ప్రభుత్వాలలో ఈవిధంగా ఎన్నడూ లేదని అన్నారు. విద్యార్థులకు టీచర్ల కొరత ఉందని పోస్టులను భర్తీ చేయాలని అలాగే హెచ్ ఎం హెూదాల్లో రిటైర్డ్ అవ్వాల్సిన వారు టీచర్ల గానే రిటైర్డ్ అవుతున్నారని ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి పిఆర్సి బకాయిలు పడిపోయిందని ఉద్యోగస్తులు ఎంతో నష్టపోయారని ఎంతో మంది మరణించారని అలాగే రిటైర్డ్ కూడా అయ్యారని ఏడు డి ఎ లు పెండింగ్ లో ఉన్నాయని వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. ప్రభుత్వం వచ్చిన వారం రోజులకే సి.పి.ఐ ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు అమలు చేయలేదని కాంట్రాక్టు ఉద్యోగులు మగ్గి పోతున్నారని కన్సల్టెంట్ పే క్రింద పెట్టి 30 సంవత్సరాల నుంచి అదే జీతంతోనే బ్రతుకుతున్నారు అని అలాగే పలు అంశాల పైన ప్రభుత్వ ఉద్యోగులు మేము కలసి పలు దఫాలుగా చర్చలకు పోయినప్పటికీ బ,ా ్ గ సా్ వ ు ్య ల ు చేసుకోలేకపోతున్నారు అని ఇది కేవలం ప్రభుత్వ వైఫల్యమే అని ఉద్యోగులు పని కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది

**సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చదివే విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుంది**

**ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్**



చిలకలూరిపేట: (ప్రజాపాలన ప్రతినిధి)రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాలు చదివేవి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ అన్నారు. బుధవారం ఆయన సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ కనీసం విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించే విషయంలో జాప్యం చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తున్న ప్రభుత్వం.. విద్యార్థుల సంక్షేమం పట్టదా అని పలు ప్రశ్నలు సంధించారు. ఎస్సీ, ఎస్టీ,బీ.సీ, గురుకుల పాఠశాల, మోడల్ పాఠశాల లో చదువుతున్న విద్యార్థులకు నెలలు గడుస్తున్నా వారి సంక్షేమం గురించి విస్మరించడం తగదని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రారంభం అయిందని దాని వలన పలు వసతి గృహాల్లో జలుబు, దగ్గు, చర్మవ్యాధులు లాంటి సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులకు వారానికి ఒకసారి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా అధికారులు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదివే విద్యార్థుల పైన ప్రత్యేకమైన దృష్టి సారించి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కాస్మోటిక్ ఛార్జీలు తక్షణమే ఇప్పించాలని కోరారు.

## కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి



పెనుగంచిప్రోలుడిసెంబర్8ప్రజాపాలనప్రతినిధి: గ్రామానికి చెందిన పద్మనాభుని సత్యనారాయణ,నాగ చంద్రావతి దంపతుల వర్ధంతి సందర్భంగా వారికి, మాజీ ముఖ్యమంత్రి మరియు గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన పెనుగంచిప్రోలు మేజర్ గ్రా మ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి వై య స్ఆర్సిపి సీనియర్ నాయకులు వేల్పుల రవికు మార్,వీరి కుమారులు డా. పద్మనాభుని వెంకట అ ప్పాజీ ప్రభాకర్ రావు, సంజయ్, అమర్,స్వామి సత్య నారా యణ (బాబు), ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మంగ పతి, పచ్చిపులుసు చంద్రశేఖర్, వీరవల్లి దుర్గా ప్రసాద్, స్వామి గోపాలరావు,వనమా అర్జున్ రావు, దివ్వె లహరీష్ కుమార్, యామినిసుష్మా.మోహన్ రావు, మామిడి అప్పారావు తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని డిసెంబర్ 21న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

కొవ్వూరు,ప్రజాపాలన ప్రతినిధి 8.12.2021 కొవ్వూరు డివిజన్ పరిధిలో 3081 మంది లబ్దిదారులు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద రూ. 291.61 లక్షలు చెల్లింపులు చెయ్యడం జరిగిందని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. మల్లిబాబు బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం పేద, నిరుపేద, మధ్య తరగతి వర్గాల కుటుంబాల కోసం జగనన్న గృహ హక్కు పథకం మరో చక్కటి పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఆర్డీవో తెలిపారు. ఈ పథకం కింద 1983 తర్వాత హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా ఇళ్ళు మంజురూ చేశారన్నారు. ఆ స్థలాలు, ఇళ్ళు పై సంపూర్ణ హక్కులు కల్పించే దిశగా వన్ టైం సెటిల్ మెంట్ చేసుకున్న లబ్ధిదారులకు డాక్యుమెంట్స్ ఇవ్వడంతో పాటు రిజిస్టర్ టైటిల్ ఇస్తామని పేర్కొన్నారు. అమ్ముకోవాలన్నా, రుణాలు తెచ్చుకోవాలన్నా లబ్ధిదారులకు పూర్తి హక్కులు వస్తాయని తెలిపారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ప్రయోజనాలు చాలా ఉన్నాయని, పట్టా తీసుకున్న వారు, ఇల్లు కట్టుకున్న వారు.. హౌసింగ్ కార్పొరేషన్ నుంచి రుణాలు తీసుకున్న వారికి గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు, మునిసిపాలిటీల్లో రూ.15 వేలు, కార్పొరేషన్‌లలో రూ.20వేలు చెల్లిస్తే ఈ పథకం వర్తిస్తుందని ఆయన తెలియచేసారు. ఆ లబ్ధిదారులకు ఎంత రుణం ఉన్నా.. వన్ టైం సెటిల్ మెంట్ కింద మిగిలిన రుణం ఎంత ఉన్నా మాఫీ అవుతుందని మల్లిబాబు తెలిపారు. ఒకవేళ ఆమొత్తం ఇంకా తక్కువ ఉన్న యెడల అమొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుందన్నారు. విఆర్వో, ఇంజినీరింగ్ సహాయకులు వొచ్చి సర్వే కొలతలు తీసుకుని నిర్ధారణ చెయ్యడం జరుగుతుందన్నారు. లబ్దిదారులకు డిసెంబర్ 21న సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా జారీ చేస్తారని తెలిపారు. ఇది పూర్తిగా స్వచ్ఛంద పథకమని, ఓటీఎస్ వలన ప్రతి లబ్ధిదారునికి రిజిస్ట్రేషన్ కోసం, యూజర్ చార్జీల కోసం చేసే ఖర్చు ఆదా అవుతుందన్నారు. డివిజన్ పరిధిలోని కొవ్వూరు మండలం లో 386 మంది, తాళ్లపూడి లో 265 , నిడదవోలు లో 236 మంది లబ్దిదారులు చెల్లింపు చెయ్యడం జరిగిందన్నారు. పథకం యొక్క ప్రయోజనం ప్రజలకు వివరించి వారిలో అవగాహన కల్పించే దిశగా మండల, మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మున్సిపల్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నరసాపురం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : పట్టణంలో నూతనంగా నిర్మించిన యర్రమిల్లి నారాయణమూర్తి మున్సిపల్ కాంప్లెక్సును బుధవారం శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ఎవరికీ ఇబ్బంది కలగకుండా పరిశుభ్రమైన వాతావరణంలో తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని అన్నారు. వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని రకములైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు భూసారపు జయప్రకాష్, మండల అధ్యక్షుడు కర్రి ఏసు, కౌన్సిలర్ బర్రి జయరాజు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ బుల్లి మస్తాన్, వ్యాపారులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో నాలుగు తరగతులు శంకుస్థాపన



గన్నవరం ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 8: ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో దాతలు సూరెడ్డి . శరత్ చంద్రబోస్ మరియు పూర్వ విద్యార్థుల సహకారంతో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల శంకుస్థాపన కార్యక్రమం చేశారు వీరిలో సూరెడ్డి శరత్ చంద్రబోస్ 25,00,000 పూర్వ విద్యార్థుల సంఘం వారు 25,00,000 నాలుగు తరగతులు నిర్మించుటకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విరాళం ఇచ్చినారు ఈ కార్యక్రమంలో గోగినేని వెంకటేశ్వర రావు గారి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తరగతుల కొరత వల్ల క్లాసుల నిర్వహించుట కష్టంగా ఉన్న పరిస్థితుల్లో తరగతి గదులు నిర్మించుట ఆనందదాయకం అని తెలియజేశారు పాఠశాలలోనే ఉపాధ్యాయులు మరియు సిబ్బందులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమానికి మానికొండ సర్పంచ్ నిమ్మకూరు స్వర్ణలత వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ సచివాలయ సిబ్బంది ఎస్ ఎం సి సభ్యులు గ్రామ పెద్దలు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చంద్రబాబు కంటే సీఎం జగన్మోహన్ రెడ్డి ఎక్కువ రోడ్లు వేయించారు

**గత ప్రభుత్వం శంకుస్థాపనలతోనే కాలం వెల్లదీసింది**

**విజయవాడ-నూజివీడు రోడ్డు పున: నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు శంకుస్థాపన**

**ఓటీఎస్ పై చంద్రబాబు దుష్ప్రచారాలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు**

**ఈ నెల 9న వాంబేకాలనీలో ఓటీఎస్ పై అవగాహన సదస్సు: ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలో రహదారులకు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విజయవాడ - నూజివీడు ప్రధాన రహదారి(పైపుల రోడ్డు సెంటర్ నుంచి నున్న బైపాస్ జంక్షన్ వరకు) పునః నిర్మాణ పనులకి డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి తో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణను కనీసం పట్టించుకోలేదని మల్లాది విష్ణు అన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రోడ్ల పునరుద్ధరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో వేసిన రోడ్ల కంటే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండున్నర ఏళ్లలో అధిక రోడ్లు వేశారన్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లలో కొత్తగా 1,356 కి.మీ మాత్రమే తారు రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లలోనే కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 1,883 కి.మీ తారు (బీటీ) రోడ్ల నిర్మాణం జరిగినట్లు వెల్లడించారు. దీంతోపాటు రెండేళ్లలోనే 4,015 కి.మీ మేర రహదారుల విస్తరణ, అభివృద్ధి, మరమ్మతులు జరిగాయన్నారు. నాడు-నేడు తరహాలో రోడ్లు మరమ్మతులు చేసిన తర్వాత ఆ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అంతేకాకుండా రహదారులకు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్ అండ్ బీకి రూ. 500 కోట్లకు పైగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు అలంపూర్ విజయలక్ష్మి, జానారెడ్డి, ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మ, ఎండి షాహినా సుల్తానా, యర్రగొర్ల తిరుపతమ్మ, ఇసరపు దేవి, 60వ డివిజన్ వైసీపీ కో ఆర్డినేటర్ బేవర నారాయణ, నాయకులు వీరబాబు, శైలజా భాయ్, ఉద్ధంటి సురేష్, దుర్గారావు, రామిరెడ్డి, భోగాది మురళి, పసుపులేటి ఏసు, సీహెచ్ రవి, హైమావతి, వీఎంసీ అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండల మహాసభ




చందోలు(పిట్టలవాని పాలెం)ప్రజాపాలన:ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంలో యూటీఎఫ్ ముందంజలో ఉంటుందని యూటీఎఫ్ సీనియర్ నాయకులు, సీనియర్ ఉద్యమ నేతలు పాల్, డేవిడ్ లు పేర్కొన్నారు.బుధవారం మండలంలోని చందోలు యుటిఎఫ్ కార్యాలయం వద్ద నిర్వహించిన పిట్టలవానిపాలెం మండల యూటీఎఫ్ మహాసభలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.అనంతరం యూటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఎన్నికల అధికారిగా ఎం.వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించారు.మండల యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులుగా ఇంకొల్లు శ్రీనివాసరావు, మండలశాఖ అధ్యక్షులుగా ఎండి రహంతుల్లా, ఉపాధ్యక్షులుగా ఏ.అయ్యప్ప, బర్కతున్నిసా, ప్రధాన కార్యదర్శిగా ఎండి రాఖీబుద్దిన్, కోశాధికారిగా ఎండి అష్రఫ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఉపాధ్యాయులు, పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కు శుభాకాంక్షలు తెలిపిన పొన్నూరు వైకాపా నాయకులు



పొన్నూరు, డిసెంబర్8( ప్రజా పాలన ప్రతినిధి) ఎ మ్మె ల్సీ గా ప్రమాణస్వీకారం చేసిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ను కలసి పొన్నూరు వైసీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మండలి చైర్మన్ కార్యాలయంలో కొత్త ఎమ్మెల్సీలతో చైర్మన్ మోషేన్‌రాజు ప్రమాణం చేయించారు. ఏపీలో స్థానిక సంస్థల కోటాలో 8 జిల్లాలోని 11 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు.గుంటూరు నుంచి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పొన్నూరు శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కిలారి రోశయ్య రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణ రావు పొన్నూరు మండలం జడ్పిటిసి కర్లపూడి రమేష్ వైసిపి సీనియర్ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు,డాక్టర్ ఎన్. రూత్ రాణి,దండమూడి సర్పంచ్ భవనం వంశీ రెడ్డి,అంబటి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన కొమ్మారెడ్డి పట్టాభిరామ్




చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి) తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి ప ట్టా బి రా వ్ నరసరావుపేట వెళుతూ మార్గ మధ్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కోరిక మేరకు ప ట్ట ణ ం లో ని చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా పట్టాభి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులతో కొంతసేపు ముచ్చటించారు. పార్టీ కోసం కష్టించే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. పట్టాభి తో పాటు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెళ్ల బ్రహ్మం చౌదరి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు బండారు వంశీ కృష్ణలు ఉన్నారు.

## దళితులు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకులు సహకరించాలి-పినమాల నాగ కుమార్



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి, : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మెన్ మారుమ్ముడి విక్టర్ ప్రసాద్ గారిని కలిసిన ఎపిడిఐఐఎ కో ఆర్డినేటర్ పినమాల నాగ కుమార్ కలిసి వివిధ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పారిశ్రామిక వ్యాపార పథకాలుకు సంభందించిన ఋణాలు ప్రధానమంత్రి ఉపాది హామీ పథకము పి ఎమ్ జి ఇ పి ఎమ్ ఎస్ ఎమ్ ఇ,వై ఎస్ ఆర్ జగనన్న బడుగు వికాసం పథకాలకు స్టాండ్ అప్ ఇండియా పథకాలు ద్వారా సెక్యూరిటీ లేకుండా ఇవ్వాలి అనేది వున్నా బ్యాంకు అధికారులు సరిగ్గా స్పందించడం లేదు కనుక ఎస్ ఎల్ బి సి అధికారులుతో చర్చించి ఎస్సీ ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కు ప్రోత్సాహం ఇవ్వాలి అని వినతి పత్రం అందచేసారు.

## సన్నరకానికి.. అధరహో...



నల్గొండ, డిసెంబర్ 8, :ఉమ్మడి నల్లగొండలో సన్నరకం ధాన్యాన్ని మిల్లుల్లో విక్రయిస్తున్న రైతులకు ఇప్పుడు మంచి ధర వస్తోంది. ఈ నెల మొదట్లో ఎక్కువ మందికి క్వింటాకు రూ. 1,700, కొంతమందికి రైతులకు రూ. 1,960లోపే చెల్లించిన మిల్లర్లు.. ఇప్పుడు సర్కారు మద్దతు ధర రూ. 1,960 కన్నా ఎక్కువగా గరిష్టంగా రూ. 2,300 వరకు ఇస్తున్నారు. దీంతో రైతులు సంబురపడిపోతున్నారు. జిల్లాలోని మిల్లర్లు సన్నరకం ధాన్యాన్నే ఎగుమతి చేస్తారు. ఈ ధాన్యాన్ని రా రైస్‌గా మార్చి హైదరాబాద్ సహా దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలు, విదేశాలకు ప్రతి ఏడాది ఎగుమతి చేస్తుంటారు. ఇటీవల ఆయా ప్రాంతాల వ్యాపారులు పెద్ద ఎత్తున సన్నరకం కావాలని కోరడంతో ధాన్యం కొనుగోళ్లను పెంచినట్లు మిల్లర్లు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సన్న ధాన్యం విక్రయించేందుకు వస్తున్న రైతులు తగ్గడంతో మిల్లర్లు పోటీపడి మరీ ఎక్కువ ధరకు కొంటున్నారు. ఒక్క మిర్యాలగూడలోనే 83 మిల్లులు సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో సన్నరకం ధాన్యం 6,09,758 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. ఇందులో రైతులు తాము తినేందుకు పక్కనపెట్టుకున్నవి పోనూ మిగతా 5 లక్షల మెట్రిక్ టన్నులు అమ్ముతారని అధికారులు అంచనా వేశారు. మిల్లర్లు ఇప్పటికే 3.5 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నారు. దీంతో ధాన్యం రాక తగ్గింది. యాదాద్రి జిల్లాలో 1.12 లక్షల హెక్టార్లకు గాను 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇందులో ఎక్కువ శాతం సాధారణ రకమే.సూర్యాపేట జిల్లాలో 4,51,623 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి రాగా ఇందులో సగానికిపైగా ఇప్పటికే మిల్లర్లకు అమ్మేశారు. ఇలా వచ్చే ధాన్యం తగ్గుతుండటం, వ్యాపారుల నుంచి డిమాండ్ ఉండటంతో రేటు పెరుగుతోంది.

# ఇక ఎంపీలు రాజీనామాలేనా..?

హైదరాబాద్, డిసెంబర్ 8, :హుజూరాబాద్ ఓటమి తర్వాత, బీజేపీతో రాజకీయ ముప్పు తప్పదని నిర్ణయానికి వచ్చారో లేక ఇంకేదైనా కారణం వుందో ఏమో కానీ, తెరాస అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్, ధాన్యం కొనుగోళ్ల అంశాన్ని అస్త్రంగా చేసుకుని బీజేపీ టార్గెట్ కేంద్రంపై రాజకీయ యుద్ధాన్ని ప్రకటించారు. అలాగే, ఇంతవరకు సమయానుకులంగా వ్యూహాన్ని మార్చుకుంటూ, విభిన్న రూపాల్లో తెరాస నాయకత్వం యుద్ధతంత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదటి రోజు నుంచే పార్లమెంట్ ఉభయ సభల్లో, ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని తెరాస ఎంపీలు నిరసన తెలుపుతున్నారు.అయితే కేంద్ర ఆహార శాఖ మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంట్ ఉభయ సభల్లో ఒకటికి రెండు సార్లు వివరంగా, విపులంగా సమాదానం ఇచ్చారు.కానీ గోయల్ తెరాస సభ్యులు కోరుకున్నసమాధానం మాత్రం ఇవ్వలేదు. యాసంగి పంట విషయంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రభుత్వాలతో సంప్రదించి ఒకే సారి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతేకాదు కేంద్ర గోయల్ తెలంగాణ ఎంపీలు ధాన్యం కొనుగోలు విషయాన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారమే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.బాయిల్డ్ రైస్ ఎంత కొంటారో కేంద్రం స్పష్టం చేయాలన్న తెరాస ఎంపీల ప్రశ్నకు సమాధానమిచ్చారు కేంద్రమంత్రి. వినియోగించే ధాన్యాన్నే కొనుగోలు చేస్తామన్న పీయూష్ గోయల్.. ఈ మేరకు సీఎం కేసీఆర్ తో కూడా మాట్లాడానని తెలిపారు. వానాకాలం పంట పూర్తిగా కొంటామని చెప్పారు. అయినా దీంతో కేంద్రం క్లారిటీ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, తెరాస ఎంపీలు శీతాకాల సమావేశాలను బాయ్‌కాట్ చేస్తున్నామని తెరాస ఎంపీ



కే.కేశవరావు ప్రకటించారు. ఈ సందర్భంగా కేకే చేసిన వ్యాఖ్యలు, ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్తా ఆలోచనలకు అద్దం పడుతున్నాయని అంటున్నారు. ముఖ్యమంత్రి రాజకీయాలను మరోమారు ఉద్యమ పంథాలోకి తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే కేకే రాజీనామాల అంశాన్ని చూచాయగా చేశారని అంటున్నారు. ఏమైనా కేకే వ్యాఖ్యలు అనుమానాలకు ఆస్కారం కలిపిస్తున్నాయని అంటున్నారు. టీఆర్ ఎస్ ఆందోళనపై కేంద్రం స్పందించడం లేదని, కేంద్రప్రభుత్వ తీరుకు నిరసనగా శీతాకాల సమావేశాలను బాయ్‌కాట్ చేస్తున్నామని ఎంపీ కె.కేశవరావు స్పష్టం చేశారు. చట్టసభను బాయ్‌కాట్ చేయడం బాధకలిగించే విషయమేనని.. ఇలా చేయాలని ఎవరూ కోరుకోరని అన్నారు.అలాగే, 'కేంద్ర వైఖరి అర్థం చేసుకుని ప్రజా క్షేత్రంలోకి వెళ్లి పోరాడాలని నిర్ణయించుకున్నాం. రైతుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని మా పోరాటం కొనసాగుతుంది. తెరాస ప్రభుత్వం నూతన పంథాలో పోరాటం మొదలు పెడుతుంది" అన్నారు, అంతవరకు బానే వుంది, కానీ ఆవెంటనే కేకే, రైతుల కోసం రాజీనామా చేసే అంశాన్ని ఆలోచిస్తాం, అంటూ పేర్కొనారు. ఇలా కేకే తెరాస ప్రభుత్వం నూతన పంథాలో పోరాటం మొదలు పెడుతుందని,వెంటనే రాజీనామాల ప్రస్తావన తీసుకు రావడం, అలోచింప చేసే విధంగా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో ఉద్యమ సమయంలోనూ కేసీఆర్, ఉద్యమ వేడి తగ్గిన పలు సందర్భాలలో ప్రజా ప్రతినిధుల రాజీనామాలను రాజకీయ అస్త్రంగా ప్రయోగించారు. ఇప్పుడు కూడా రాష్ట్రంలో వీస్తున్న రాజకీయ ఎదురు గాలులను తట్టుకునేందుకు కేసీఆర్ మరోమారు రాజీనామా అస్త్రాన్ని బయటకు తీశారా? అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వినవస్తున్నాయి

## విన్నూత్న పద్ధతిలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ఎలైట్



అనంతపురం, డిసెంబరు 07 : రాత్రి 11 గంటలకు రైల్వే స్టేషన్ మరియు బస్టాండ్ వీధులల్లోనిరాదరణ గురైన పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం లయన్స్ క్లబ్ ఎలైట్‌సభ్యులు చేపట్టారు చలికి తట్టుకోలేని పేదలకు కొంతమందికైనా ఉపశమనం కల్గించడానికితమ క్లబ్ ఈ కార్యక్రమం చేస్తున్నట్లు క్లబ్ చార్టర్‌ప్రెసిడెంట్ తాడికొండ సత్యనారాయణ తెలిపారు.ప్రజా సేవలు మరింత ప్రభావవంతమైన సంస్థలను సృష్టించడం, బలమైన సంఘాలను ఏర్పరచడంతో పాటు సమానత్వం, అవకాశాలను పెంపొందించడం వంటి కార్యక్రమాలను లక్ష్యంగా పెట్టుకొని లయన్స్ క్లబ్ ఎలైట్‌కృషి చేస్తుందని అన్నారు.క్లబ్ కార్యదర్శి వైష్ణవ శ్రీనాథ్ మాట్లాడుతూ ఎలైట్ క్లబ్ ఉత్తమ పౌర సమాజమేధ్యేయంగా వివిధ సామాజిక సేవలలో విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగ శిక్షణ, దత్తత, సమాజ నిర్వహణ, మానవ సంబంధాలు మెరుగు పడడానికిచాల కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు.




సమాజంలో జరుగుతున్న హింస, అస్లీలత, సైబర్ నేరాలు, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాలు ఇతర పౌర ప్రజా సంఘాలతోకలసి పని చేస్తున్నట్లు క్లబ్ మెంటర్ లయన్ విరూపాక్ష రెడ్డి తెలిపారు.మానవసేవే – మాధవసేవ" నమ్మి కార్యక్రమాలు రూపొందించే సదాశయంతో ఏర్పడిన క్లబ్ తక్కువ కాలంలో సామజిక కార్యక్రమాలతోపాటు విద్య, ఉపాధి కల్పన మరియు సాంకేతిక విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం అలాగే భారతీయ సంస్కృతికి, సమాజహిత కార్యకలాపాలకు సంబంధించిన వ్యక్తులనుచైతన్యము కలిగించుట. సమాజ ప్రతిబంధకాలైనఅవిద్య, అజ్ఞానం ,మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టడం అభినందించ తగ్గ విషయమని ప్రజా సైన్సు వేదిక అధ్యక్షులు డా ఎం. సురేష్‌బాబు తెలిపారు. ఈ నెలలో రెండు హాంగర్ రిలీఫ్ కార్యక్రమాలు, చిరు వ్యాపారస్థులకుగొడుగుల వితరణ, అలాగే నిరాశ్రుయులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి బి నాగేంద్ర ప్రసాద్, లయన్ బి పృధ్విరాజ్, లయన్ నిట్టూరు రాఘవేంద్ర, ఇంజినీర్‌శ్యామ్ సుందర్, లయన్ బాబా ఫక్రుద్దీన్, డాక్టర్ ఎర్రమల అమరనాథ్, లయన్ సురేంద్రనాథ్ రెడ్డి, లయన్ వెంకట నారాయణ, సునంద రెడ్డి, నాగేశ్వర రెడ్డి, ఎస్ లోకేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణకు అడ్డంకిగా కోర్టు కేసులు

వరంగల్, డిసెంబర్ 8, :జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశ ముందుకు సాగడం లేదు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూ పాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలతో పాటు కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని 6.21లక్షల ఎకరాలకు నీరిందించే ఈ ప్రాజెక్టు 18 ఏళ్లు కావస్తున్నా పూర్తి కావడం లేదు. రెండున్నర వేల ఎకరాలకు పైగా భూసేకరణ, కొన్నిచోట్ల రిజర్వాయర్లు పూర్తికాలేదు. సొరంగం పనులు పూర్తయినా కాల్వల లైనింగ్ పనులు కొనసాగుతున్నాయి. 2004లో రూ.6,084 కోట్లున్న అంచనా వ్యయం 2020 జూన్ నాటికే రూ.14,945 కోట్లకు పైగా పెరిగిందని అధికారులు వెల్లడించారు. 3లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో 2004 లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. తెలంగాణ ప్ర భుత్వం ఏర్పాటైన తర్వాత ఆయకట్టు లక్ష్యం 6.21 లక్షల ఎకరాలకు పెరిగింది. దేవాదుల ఎత్తిపోతల జలాలను ఉమ్మడి వరంగల్ జిల్లాకే వినియోగించాలని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ క్రమంలో 5.61లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యం తో పనులు ప్రారంభించారు. అయితే ఇతర జిల్లాల రైతాంగ అవసరాలను బట్టి ఆయకట్టు లక్ష్యం 6.21 లక్షల ఎకరాలకు చేరింది. మొదటి దశలో 1.23 లక్షలు, రెండోదశలో 1.91 లక్షలు, మూడోదశలో 3.07 లక్షల ఎకరాల ఆయకట్టు కోసం పనులు మొదలు పెట్టారు. తొలుత 38.182 టీఎంసీలను పంపింగ్ చేయాలని నిర్ణయించగా.. ఇప్పుడు పెరి గిన ఆయకట్టు దృష్ట్యా దాదాపు 60 టీఎంపీల నీటి ఏటా ఎత్తి పోయాల్సి ఉంది. మొదటి రెండు దశల పనులు దాదాపుగా పూర్తికాగా మూడో దశ పనుల్లో ఎప్పటికప్పుడు తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు కోసం 31,383 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, 28,793 ఎకరాలు సేకరించారు. మరో 2,590 ఎకరాలను సేకరించాల్సి ఉండగా, కోర్టు కేసుల వంటివి అడ్డంకిగా మా రాయి. మరోవైపు పాలకుర్తి, లింగాల గణపురం మండలంలోని నవాబ్‌పేటలో రిజర్వాయర్లు పూర్తి కావలసి ఉ ంది. ఇక, దేవాదుల ప్రాజెక్టులో కీలకమైంది 49.08 కిలోమీటర్ల హైడ్రాలిక్ అండర్ టన్నెల్. మూడో దశ, మూడో ప్యాకేజీ కింద చేపట్టిన ఈ టన్నెల్ పనులకు 2008 నుంచి 2014 వరకు అవాంతరాలు ఏర్పడ్డాయి. 3 కాంట్రాక్టు ఏజెన్సీలను మార్చారు. తెలం గాణ రాష్ట్రం, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2016లో రూ.1,494 కోట్ల అంచనాతో పనులు పునఃప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు సొరంగం పనులు పూర్తయినా, కాల్వల లైనింగ్ పను లు సాగుతున్నాయి. ధర్మసాగర్ చెరువులో నుంచి డిస్ట్రిబ్యూటరీ ద్వారా 1,22,700 ఎకరాలకు కాలువ ద్వారా సాగునీరు అందించేందుకు రెండు (45 అండ్ 46 ) ప్యాకేజీల ద్వారా రూ.150.43 కోట్లతో పనులు చేపట్టారు.

# నో స్కూల్స్ అంటున్న పేరెంట్స్

వరంగల్, డిసెంబర్ 8, :రాష్ట్రంలోని విద్యాసంస్థలు కొవిడ్‌తో సతమతమవుతున్నాయి. థర్డ్?వేవ్?భయంతో స్కూళ్లకు రావాలంటేనే విద్యార్థులు జంకుతున్నారు. తమ పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు సైతం వెనుకడుగు వేస్తున్నారు. గురుకులాల్లో కరోనా బారిన పడుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలో కొవిడ్ సెకండ్?వేవ్? తగ్గుముఖం పట్టడంతో విద్యార్థులు ఇప్పుడిప్పుడే బడిబాట పట్టారు. దీంతో రెండేళ్ల తర్వాత విద్యార్థుల హాజరుశాతం 80 శాతానికి చేరువలో ఉంది. కాగా ఒమిక్రాన్? వేరియంట్ చాపకింద నీరులా క్రమంగా విస్తరిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో రెండు రోజుల్లో దాదాపు 500కి పైగా కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కొందరు విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు జంకుతున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను బడికి పంపించేందుకు సుముఖంగా లేకపోవడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినట్లుగా తెలిసింది. దాదాపు 20 శాతం వరకు విద్యార్థుల హాజరుశాతం తగ్గిందని సమాచారం. ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న విద్యావ్యవస్థను ఈ మహమ్మారి మళ్లీ చిన్నాభిన్నం చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఫస్ట్ వేవ్ లాక్?డౌన్ కారణంగా విద్యాసంస్థలు మూతపడ్డాయి.

### హాట్ స్పాట్స్ గా గురుకుల పాఠశాలలు



దీంతో విద్యార్థులంతా ఇంటికే పరిమితమయ్యారు. తద్వారా వారు చదువును కోల్పోయారు. ఆన్?లైన్? విధానం తీసుకొచ్చినా విన్నది మాత్రం కొందరే. కాగా కొవిడ్? కాస్త తగ్గుముఖం పట్టడంతో ఇటీవలే ప్రత్యక్ష తరగతులను ప్రభుత్వం ప్రారంభించింది. అనూహ్యంగా వైరస్ వ్యాప్తి చెందడం, గురుకులాల్లో కేసులు పెరగడంతో పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గినట్లు తెలుస్తోంది. దీనిపై విద్యాశాఖ అధికారులు ఎలాంటి స్పష్టతనివ్వకపోవడం గమనార్హం. అయితే పలు జిల్లాల్లోని అధికారులు మాత్రం ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే విద్యార్థుల హాజరు శాతం అత్యధికంగా తగ్గినట్లు చెబుతున్నారు. రూరల్ ఏరియాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్?ప్రాంతాల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గిందని వెల్లడిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి ఈ విద్యా సంవత్సరానికి 60 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బడుల్లో ప్రత్యక్ష బోధన ప్రారంభమై మూడు నెలలు కావొస్తోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే గురుకులాల్లోనే అత్యధికంగా కొవిడ్ ?కేసులు నమోదయ్యాయి. రెండు వారాల్లో మొత్తంగా దాదాపు 500 కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఇరుకు గదులు, కనీస సౌకర్యాలు లేకపోవడం, కొవిడ్ నిబంధనలు పాటించకపోవడం వల్లే వైరస్? వ్యాప్తి చెందినట్లు ఇప్పటికే విద్యాశాఖ వెల్లడించింది. ఈ కారణంగా గడిచిన వారం రోజుల్లో హాజరు శాతం దాదాపు 20 శాతం మేర తగ్గింది. రెగ్యులర్‌గా వచ్చే విద్యార్థులు సైతం రెండు మూడు రోజులకోసారి వస్తున్నట్లు కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు చెబుతున్నాయి. సెకండ్ వేవ్‌లోనూ గురుకులాలే హాట్?స్పాట్లుగా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడూ గురుకులాల్లోనే ఎక్కువ మందికి పాజిటివ్?వస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గురుకులాలతో పోల్చుకుంటే డే స్కాలర్ స్కూళ్లలో కొవిడ్ ప్రభావం కాస్త తక్కువగానే ఉంది. ఆన్‌లైన్ విద్యాబోధన నుంచి ఆఫ్‌లైన్‌కి విద్యార్థులు అలవాటు పడుతున్న తరుణంలో కొవిడ్ వ్యాప్తి చెందడం పేరెంట్స్ గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. పాఠశాలలకు పంపించినా వైరస్?బారినపడే ప్రమాదముందని జంకుతున్నారు. ఒకవేళ కరోనా విజృంభిస్తే ఇక విద్యాసంస్థల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారే అవకాశాలున్నాయి.నో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేట్? విద్యాసంస్థలు, గురుకులాలను హాట్‌స్పాట్ల జాబితాలో చేర్చి వైరస్ నియంత్రణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తోంది. విద్యార్థులంతా మాస్కులు ధరించేలా.. ప్రతీ క్లాసులో విధిగా శానిటైజర్లతో చేతులను శుభ్రం చేసుకునేలా.. జాగ్రత్తలు సూచిస్తోంది. నిన్నమొన్నటి వరకు బెంచీకి నలుగురైదుగురు విద్యార్థులు కూర్చోగా.. ప్రస్తుతం ఇద్దరు, ముగ్గురినే పరిమితం చేస్తూ విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. పాఠశాలలను ఉదయం, సాయంత్రం శానిటైజ్ చేసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

## జనగామ జిల్లాలో జోరుగా కోవిడ్ వ్యాక్సినేషన్

జనగామ: జిల్లాలోని పలు మండలాల్లో కోవిడ్ వ్యాక్సినేషన్ పక్రియ భారీ ఎత్తున జరుగుతోంది. పెద్ద సంఖ్యలోప్రజలు వ్యాక్సిన్ తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు.ఈ సందర్భంగా జనగామ జిల్లా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామంలో 2వ విడత టీకా కార్యక్రమాన్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా అందరికీ 2వ డోస్ టీకాలు అందేలా చూడాలని అధికారులను అదేశించారు. ప్రతి ఒక్కరూ 2 డోసుల టీకాలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కరోనా మరోసారి పలు దేశాల్లో విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.సామాజిక, భౌతిక దూరం పాటించాలని, మాస్కు లు ధరించాలని సూచించారు.



# ఓటీటీ రూమర్లకు థాంక్యూ టీమ్ చెక్




వరుస ఫ్లాపుల తరువాత మజిలీ హిట్తో నాగచైతన్య మళ్లీ ట్రాక్లోకి వచ్చేశారు. ఆ తరువాత చేసిన వెంకీ మామ లవ్ స్టోరీ చిత్రాలు కూడా వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలవడంతో రెట్టించిన ఉత్సాహంతో తన తదుపరి చిత్రాలతో ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేయడానికి రెడీ అవుతున్నాడు. ప్రస్తుతం నాగ చైతన్య నటిస్తున్న తాజా చిత్రం థాంక్యూ మనం ఫేమ్ విక్రమ్ కె. కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఓ విభిన్నమైన కథతో ఈ మూవీని రూపొందిస్తున్నారు. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ మూవీలో చైకి జోడీగా రాశిఖన్నా అవికా గోర్ నటిస్తున్నారు. కీలక పాత్రలో విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ కనిపించబోతున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానిగా కనిపిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన ఓ వీడియో ఆ మధ్య నెట్టింట వైరల్ గా మారిన విషయం తెలిసిందే. ఈ మూవీ షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. అయితే తాజాగా ఈ చిత్ర విడుదలపై నెట్టింట ఓ రూమర్ వైరల్ గా మారింది. అదేంటంటే ఈ చిత్రాన్ని థియేటర్లో కంటే ఓటీటీలో విడుదల చేయాడానికే నిర్మాత దిల్ రాజు ఆసక్తిని చూపిస్తున్నారని వార్తలు షికారు చేస్తున్నాయి. ఇప్పటికే ఓ ప్రముఖ ఓటీటీ సంస్థతో మేకర్స్ సంప్రదింపులు జరిపారని త్వరలోనే థాంక్యూ విడుదల తేదీని ప్రకటించబోతున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రాచారంలో ఎలాంటి వాస్తవం లేదని చిత్ర బృదం బుధవారం అధికారికంగా ప్రకటించింది. థాంక్యూ మూవీ ఫైనల్ స్టేజ్లో వుంది. చాలా డెడికేషన్ తో ఈ చిత్రానికి వర్క్ చేస్తున్నాం. ఇలాంటి చిత్రాన్ని బిగ్ స్క్రీన్ పై చూస్తే ఆ అనుభూతి కలుగుతుందని బలంగా నమ్ముతున్నాం. రైట్ టైమ్లో ఈ మూవీ థియేటర్లలోనే విడుదలవుతుంది అని చిత్ర బృందంక్లారిటీ ఇచ్చేసింది. దీంతో థాంక్యూఓటీటీ రిలీజ్ అంటూ జరుగుతున్న ప్రచారానికి తెర పడింది.

## మిక్కీ జే మేయర్ అండ్ రాహుల్ ల పై రామజోగయ్య శాస్త్రి వ్యాఖ్యలు!



న్యాచురల్ స్టార్ నాని హీరోగా సాయి పల్లవి, కృతి శెట్టి, మడోన్నా సెబాస్టియన్ లు లేడీ లీడ్ రోల్స్ లో రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం లోతెరకెక్కుతున్న చిత్రం శ్యామ్ సింగరాయ్. ఈ చిత్రం డిసెంబర్ 24 వ తేదిన ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అవుతోంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి సిరివెన్నెల లిరికల్ వీడియో ను చిత్ర యూనిట్ విడుదల చేయడం జరిగింది. సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు రాసిన చివరి పాట కావడం తో, ఈ పాటను ఆయనకు అంకితం చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. అయితే ఈ పాట పై రామ జోగయ్య శాస్త్రి గారి స్పందిస్తూ, మిక్కీ జే మేయర్ మరియు రాహుల్ సంకృత్యాన్ లు, మీరు ఆశీర్వదించబడ్డారు అంటూ చెప్పుకొచ్చారు. అందుకు దర్శకులు స్పందిస్తూ, నమస్కారం పెట్టడం జరిగింది. నాని హీరోగా వస్తున్న ఈ సినిమా లో మునుపెన్నడూ లేని విధంగా మేకోవర్ అయ్యారు. ఈ చిత్రం పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# నయీంగా మారడానికి చాలా కష్టపడ్డాను



దాము బాలాజీ దర్శకత్వంలో నయీం డైరీస్ అనే సినిమాను తెరకెక్కింది. ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ఇండస్ట్రీ వర్గాల వారితో పాటు ప్రేక్షకుల్లో కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. నయీం గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. అతడి ఎన్ కౌంటర్ కు ముందు జరిగిన నాటకీయ పరిణామాలు ఏంటీ.. అసలు నయీం ఎలాంటి వాడు.. అతడిని చంపడం న్యాయమేనా అనేది చాలా మంది చాలా రకాలుగా చర్చించుకుంటున్నారు. ఆయన తక్కువ సమయంలో వందల కోట్ల ఆస్తులను సంపాదించిన తీరు.. పోలీసులకు ఆయన చేసిన సాయాలు ఇలా ప్రతి ఒక్క విషయాలు కూడా సాదారణ జనాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇలాంటి సమయంలో నయీం డైరీస్ దొరికాయి.. వాటిలో మరిన్ని విషయాలు ఉన్నాయి.. ఎక్కడ ఎక్కడ ఎంత డబ్బు ఉంది అనే విషయాన్ని కూడా నయీం ఆ డైరీస్ లో రాశాడు అనేది టాక్. అందుకే నయీం డైరీస్ టైటిల్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. బాలాజీ ఇంతకు ముందు కిల్లింగ్ వీరప్పన్ కు కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. మాజీ నక్సలైట్ అయిన దాము బాలాజీ కథల్లో విప్లవ భావాలు ఉంటాయి. ఆయన ప్రతి ఒక్కరికి కూడా హత్తుకు పోయే కథలు రాస్తాడు అనే టాక్ ఉంది. ఈ సినిమా లో నయీం పాత్రను వశిష్ట సింహా పోషించాడు. ఇతడు కన్నడంలో పలు సినిమాల్లో నటించి మెప్పించాడు. సూపర్ హిట్ అయిన కేజీఎఫ్ లో కీలక పాత్రలో కనిపించాడు.. కేజీఎఫ్ 2 లో కూడా ఈయన కనిపించబోతున్నాడు. ఇక తెలుగు లో ఈయన పలు సినిమాల్లో నటించాడు నటిస్తున్నాడు. ఈ సమయంలో నయీం సినిమా ను చేసేందుకు ఈయన ముందుకు రావడం ఆశ్చర్యంగా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. సాదారణంగా అయితే ఇలాంటి వివాదాస్పద విషయాలపై సినిమాలు తీయడమే కష్టం.. అలాంటిది అందులో నటించేందుకు ముందుకు రావడం చాలా గొప్ప విషయం అంటారు. నెల 10వ తారీకున విడుదల కాబోతున్న నయీం డైరీస్ సినిమా ప్రమోషన్ లో భాగంగా హీరో వశిష్ట మాట్లాడుతూ.. దర్శకుడు దాము నా వద్దకు ఈ కథను పట్టుకుని వచ్చిన సమయంలో ఆశ్చర్యపోయాను. మొదట నయీం గురించి తెలుసుకునేందుకు ఇంటర్నెట్ లో సెర్చ్ చేశాను. యూట్యూబ్ లో ఎన్నో వీడియోలు చూశాను. ఆయన గురించి ఎక్కువగా చెడు అందులో ఉంది. కాని ఆయన కూడా ఒక మనిషి.. ప్రేమ పెళ్లి అతడి జీవితంలో కీలకం.. ఆయన కుటుంబం కు చాలా ప్రాముఖ్యత ఇస్తాడు.. తనను నమ్ముకున్న వారిని ఆదుకుంటూ ఉంటాడు అంటూ సినిమాలో దర్శకుడు చూపించబోతున్నారు. నయీం గురించి ఉన్న ఒక రకమైన అభిప్రాయం ఈ సినిమా తర్వాత మారుతుందనే నమ్మకం వ్యక్తం చేశాడు. ఈ సినిమాలో నటించడం కోసం నేను ఎన్నో నెలలు ఆయన గురించి తెలుసుకున్నాను. దాము స్వయంగా నక్సలైట్ అవ్వడం వల్ల ఆయన కూడా చాలా విషయాలను సేకరించాడు. అవి నాతో పంచుకునే వాడు. అలా ఎన్నో నెలలు నయీం గురించి స్టడీ చేశాం అంటూ వశిష్ట చెప్పుకొచ్చాడు. తెలుగు లో వరుసగా సినిమాలు చేయాలని ఆశ పడుతున్నట్లుగా చెప్పుకొచ్చాడు. కేజీఎఫ్ 2 లో కనిపించబోతున్నాను అని.. ముందు ముందు తెలుగు లో మరిన్ని సినిమాల్లో నటిస్తాను అన్నట్లుగా పేర్కొన్నాడు.

# స్టైలిష్ ఫైట్ కంప్లీట్ చేసిన 'భోళా శంకర్'




మెగాస్టార్ చిరంజీవి గతంతో పోలిస్తే స్పీడు పెంచేశారు. వరుస క్రేజీ ప్రాజెక్టతో రఫ్ఫాడించేస్తున్నారు. ఓ పక్క స్టార్ డైరెక్టర్ కొరటాల శివతో చేస్తున్న ఆచార్య చిత్రాన్ని రాకెట్ స్పీడుతో పూర్తి చేస్తూనే అదే స్పీడుతో మిగతా చిత్రాలని కూడా పరుగులు పెట్టిస్తున్నారు. ఆచార్య తరువాత వరుస రీమేక్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిన మెగాస్టార్ ప్రస్తుతం వాటిని పూర్తి చేసే పనిలో ఎక్కడా తగ్గట్లేదు. ప్రస్తుతం ఆయన తమిళ స్టార్ హీరో తల అజిత్ నటించిన బ్లాక్ బస్టర్ వేదాలం రీమేక్లో నటిస్తున్న విషయం తెలిసిందే. భోళా శంకర్ పేరుతో రూపొందుతున్న ఈ మూవీకి మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కీర్తి సురేష్ తమన్నాల క్రేజీ కాంబినేషన్లో రూపొందుతున్న ఈ మూవీని ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై స్టార్ ప్రొడ్యూసర్ అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. అన్నా చెల్లెలు సెంటిమెంట్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీలో మెగాస్టార్కు చెల్లెలుగా టాలెంటెడ్ నటి కీర్తి సురేష్ నటిస్తోంది. మెగా మాసీవ్ యాక్షన్ ఎంటర్టైనర్గా రూపొందుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా డీటైల్స్ని చిత్ర బృందం ట్విట్టర్ వేదికగా బుధవారం వెల్లడించింది. మెగాస్టార్ పాల్గొనగా స్టైలిష్ ఫైట్ ని పూర్తి చేశామని అలాగే ఓ భారీ సెట్లో ఓ పాటని కూడా పూర్తి చేసినట్టుగా ప్రకటించారు. సెట్లో దర్శకుడు మెహర్ రమేష్ డ్యాన్స్ మాస్టర్ శేఖర్ కు సూచనలిస్తున్న ఓ ఫొటోని షేర్ చేసిన చిత్ర బృందం సెకండ్ షెడ్యూల్ని కూడా ఇప్పటికే ప్రారంభించేశామని వెల్లడించింది. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్గా వర్క్ చేస్తున్న ఈ మూవీకి మణిశర్మ తనయుడు మహతి స్వర సాగర్ సంగీతం

# పుష్ప.. పుష్పరాజ్.. ఎక్కడా తగ్గేదే లే..!



సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన తాజా చిత్రం "పుష్ప: ది రైజ్". డిసెంబర్ 17న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ లేటెస్టుగా రిలీజ్ చేసిన ట్రైలర్ అనూహ్య స్పందన తెచ్చుకుంటోంది. తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో వచ్చిన ఈ ట్రైలర్ రికార్డ్ స్థాయిలో మిలియన్ల కొలదీ వ్యూస్ రాబడుతోంది. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో స్మగ్లర్ పుష్పరాజ్ గా ఊర మాస్ లుక్ లో అల్లు అర్జున్ ఆకట్టుకున్నారు. ఇప్పటి వరకు స్టైలిష్ పాత్రలతో అలరించిన బన్నీ.. మొదటిసారిగా కంప్లీట్ మాస్ అవతార్ లో కనిపించాడు. దీనికి తగ్గట్లుగానే చూసిన వెంటనే మొరటోడు అనుకునే హెయిర్ స్టైల్ – గుబురు గడ్డంతో డిఫరెంట్ కాస్ట్యూమ్స్ ధరించి 'డర్టీ' లుక్ లోకి మారిపోయాడు. అలానే సినిమా అంతటా ఒక భుజాన్ని పైకి లేపి కనిపించాడు. అంతేకాదు 'పుష్ప.. పుష్పరాజ్.. తగ్గేదే లే' అంటూ అల్లు అర్జున్ చిత్తూరు యాసలో డైలాగ్స్ చెబుతూ అభిమానులను ఆశ్చర్యపరిచారు. థియేటర్లలో విజిల్స్ వేయించబోతున్నారని ట్రైలర్ తో హామీ ఇచ్చారు. బన్నీ ఇంతకు ముందు మాస్ పాత్రలు పోషించినప్పటికీ.. ఇలాంటి రా అండ్ రస్టిక్ రోల్ చేయలేదనే చెప్పాలి. అందుకే ఫస్ట్ లుక్ రిలీజ్ చేసినప్పటి నుంచే 'పుష్ప' సినిమాపై అభిమానుల్లో అంచనాలు పెరిగిపోయాయి. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను ట్రైలర్ లో చూడొచ్చు. లారీలు – బైక్ లతో ఛేజింగులు వంటి ఫ్యాన్స్ ని మాంచి మాస్ ట్రీట్ ఇవ్వబోతున్నట్లు హింట్ ఇచ్చారు. ఇప్పటికే దేవిశ్రీప్రసాద్ ట్యూన్స్ కంపోజ్ చేసిన 'దాక్కో దాక్కో మేక' 'శ్రీవల్లి' 'సామి సామీ' 'ఏయ్ బిడ్డా' వంటి నాలుగు పాటలూ మాస్ ఆడియన్స్ కి ఎక్కేసాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా డిఫరెంట్ మూడ్ లోకి తీసుకెళ్లబోతోందని అర్థం అయింది. ఇందులో హీరోయిన్ రష్మిక మందన్నా కూడా డీ గ్లామర్ లుక్ లో ఆకట్టుకుంది. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ – సునీల్ – అనసూయ భరద్వాజ్ – అజయ్ – అజయ్ ఘోష్ – ధనుంజయ – రావు రమేష్ – శత్రు తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. సమంత రూత్ ప్రభు ఈ సినిమా కోసం మాస్ ఐటమ్ నంబర్ లో ఆడిపాడనుంది. థియేటర్లలో మాస్ ఫెస్టివల్ సెలబ్రేషన్స్ చేయడానికి సినీ అభిమానులకు కావాల్సిన అన్ని అంశాలను 'పుష్ప: ది రైజ్' లో చూపించబోతున్నారని తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని – రవిశంకర్ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అల వైకుంఠపురములో' తో సూపర్ హిట్ అందుకున్న అల్లు అర్జున్.. 'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటుతారని అభిమానులు ధీమాగా ఉన్నారు. సుక్కూ – బన్నీ కాంబోలో హ్యాట్రిక్ హిట్ గ్యారెంటీ అని అంటున్నారు. మరి స్టైలిష్ స్టార్ చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న ఈ మాస్ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

## భారీ రెస్పాన్స్ తో దూసుకెళ్తున్న "పుష్ప" తెలుగు, హిందీ ట్రైలర్స్!




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా క్రియేటివ్ మైండ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన భారీ చిత్రం "పుష్ప". మరి వీరి కెరీర్ లో మంచి ప్రిస్టేజియస్ ప్రాజెక్ట్ గా వస్తున్న ఈ చిత్రం నుంచి మోస్ట్ అవైటెడ్ ట్రైలర్ ని మేకర్స్ మొదటా నాలుగు భాషల్లో మొన్న రిలీజ్ చెయ్యగా హిందీలో నిన్న రిలీజ్ చేసారు. అయితే ఈ ట్రైలర్ మాత్రా తెలుగు మరియు హిందీ భాషల్లో సాలిడ్ రెస్పాన్స్ తో దూసుకెళ్తుంది. టాలీవుడ్ లో అయితే ఇప్పుడు 20 మిలియన్ వ్యూస్ కి దగ్గరగా ఉండగా మరో ఫాస్టెస్ట్ 1 మిలియన్ లైక్డ్ ట్రైలర్ గా నిలిచే దిశగా వెళుతుంది. అలాగే హిందీ వెర్షన్ కి వస్తే 24 గంటలు దాటకుండానే 5 మిలియన్ వ్యూస్ ఆల్రెడీ క్రాస్ చేసి హాఫ్ మిలియన్ లైక్స్ కి దగ్గరలో ఉంది. దీనితో పుష్ప పై ఎలాంటి అంచనాలు ఉన్నాయో మనం అర్థం చేసుకోవచ్చు. ఇక రిలీజ్ అయ్యాక పుష్ప మాస్ పార్టీ ఎలా ఉంటుందో చూడాలి. అది తెలియాలి అంటే వచ్చే డిసెంబర్ 17 వరకు ఆగాల్సిందే.


"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?

మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని
చారిటీకి వాడుతూ మెంబర్స్కు వచ్చే లాభాలను
మెంబర్స్కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే | జై భీమ్ | జై బహుజన | జై భారత్


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com